జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 2 పక్షపత్రిక జనవరి 16-31, 2016




## రాయలసీమ, ఉత్తరాంధ్ర ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనకబడిన జిల్లాలన్నిటికీ 'ప్రత్యేక హోదా' ఇవ్వాలి



లోక్‌సత్తా యువత, మహిళల పార్టీ




స్వచ్ఛ రాజకీయాలు, సమగ్రాభివృద్ధికి
జీహెచ్ఎంసీఎన్నికల్లో
'వన్ హైదరాబాద్' కూటమి



# విద్య, ఆరోగ్యం, వికేంద్రీకరణ, సరైన చర్చ, జనం చుట్టూ రాజకీయం 2016 లక్ష్యాలు కావాలి : జేపీ



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కీలకఘట్టంలో ఉన్నాయి. 2016 సంవత్సరంలో ఆర్థిక, అధికార వికేంద్రీకరణ జరిగి అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి.

సామాన్యుల శక్తిసామర్థ్యాలు వికసించేందుకు కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందరికీ అందేందుకు 2016లో పునాదులు పడాలని కోరుకుంటున్నా.

మన భవిష్యత్తు... మన పిల్లలకు మంచి ప్రమాణాల విద్య, మన కుటుంబంలో అందరికీ మంచి ఆరోగ్యం, మనందరికీ కావలసిన మౌలిక సదుపాయాల కల్పన, మన సమాజంలో అందరి మధ్యా సయోధ్య సాధించే సంస్కృతిలో ఉంటుంది తప్ప మూఢనమ్మకాలు, మంత్రతంత్రాలు,యజ్ఞయాగాదుల్లో ఉండదని సమాజంలో అన్ని వర్గాలూ గుర్తించాలి.

కొత్త సంవత్సరంలో దేశంలో చర్చ ప్రమాణాలు పెరిగి ప్రజల్లో అవగాహన, పౌరసత్వ భావన పెంపొందుతాయని ఆశిస్తున్నా.

గత సంవత్సరమంతా అధికారం చుట్టూనే రాజకీయం తిరిగింది. వచ్చే ఏడాది అలాకాకుండా ప్రజల చుట్టూ రాజకీయం తిరుగుతుందని, పార్టీల కంటే దేశప్రయోజనాలు ముఖ్యమవుతాయని, పదవుల కంటే ప్రజలకు సేవలందించటం ముఖ్యమని రాజకీయవాదులు, ఉద్యోగులు తెలుసుకుంటారని ఆశపడుతున్నా. 2015లో రక్తపాతం, ఉగ్రవాదం రెక్కలు విప్పాయి. 2016 ఆ ఉగ్రవాద కోరల్ని విరిచి అన్ని మతాలు, వర్గాలు సమాజాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొల్పేలా ఉంటుందని మనసారా ఆశిస్తున్నా.

2016 లో ప్రతి కుటుంబంలోని పిల్లలకూ మంచి భవిష్యత్తు కోసం పునాదులు పడతాయని, వ్యక్తిగత జీవితంలో ఆనందం వెల్లివిరుస్తుందని ఆకాంక్షిస్తూ దేశంలోని, రెండూ తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు శుభాకాంక్షలు.





లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇటీవల దత్తత తీసుకున్న అనంతపురం జిల్లా రుద్రం పేట గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం దృశ్యాలు. గ్రామప్రజలు పెద్దసంఖ్యలో ఈ వైద్యసేవల్ని సద్వినియోగం చేసుకున్నారని కార్యక్రమాన్ని సమన్వయం చేసిన వేలూరి అశోక్ తెలిపారు

జన రాజకీయం కోసం...

**లోక్‌సత్తా టైమ్స్**

పక్షపత్రిక జనవరి 16-31, 2016

సంపుటి - 7 సంచిక - 2

## లోపలి పేజీల్లో...

రైతు ఘోష పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.................. 5
రైతు ఆత్మహత్యల్ని ఆపాలని నిజంగా ......................... 7
జీహెచ్‌ఎంసీలో స్వచ్ఛ రాజకీయాలకు ......................... 8
మురికివాడల్ని పెంచుతున్న ప్రభుత్వ విధానాలకు........ 10
గెలిపిస్తే బస్తీలకే నిధులిస్తాం........................................ 11
స్వచ్ఛ రాజకీయాల, సమగ్రాభివృద్ధికి............................ 12
సేవ చేసేవారిని సత్కరించే థ్యాంక్‌బండ్‌గా................. 13
తెలంగాణలో సగానికిపైగా పిల్లలకు అందని టీకా........ 14
రూ.1000 కోట్ల ఇసుక కుంభకోణం జీర్ణం................ 15
'షీ' బృందాలున్నా పెరిగిప నేరాలు................................ 15
బాబాసాహెచ్ అని ఏ నాయకుడ్ని పిలుస్తారో .............. 16
వినూత్న ఆలోచనలు అంటే ఇలాంటివేనా.................. 17
ఆకార్ పటేల్ వ్యాసంపై లోక్‌సత్తా టైమ్స్ స్పందన......... 19
మోదీజీ! సహ చట్ట కర్యకర్తలా కాకుండా ప్రధానిలా....20
చౌక పర్యావరణహితం స్వచ్ఛ భారత్ సక్సెస్............... 22
పార్లమెంటు పనిచేయకపోతే దేశానికి నష్టం............ 27
మహిళలపై ఆగని వేధింపులు, దారుణాలు, మార్పు .... 28
ఉగ్రదాడుల విధ్వంసం నుంచి భారత్-పాక్................ 30
పార్లమెంటు ప్రజల గొంతుక కావాలి : జేపీ................. 31
సహకార భీమసింగి కర్మాగారాన్ని పరిరక్షించండి...... 31
రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా....... 32
కేబినెట్‌లో ఒక్క మహిళకూ చోటివ్వని వారు.............. 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం


బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# రాష్ట్రాలకు 'జవాబుదారీతనమున్న స్వయంప్రతిపత్తి' కల్పించాలి



జమ్మూకాశ్మీర్‌లో ముఫ్తీ మహ్మద్ సయీద్ వారసురాలిగా ఆయన కుమార్తె మెహబూబా ఎంపికవటం లేవనెత్తే ప్రశ్నలకన్నా, కాశ్మీర్ కుదురుకుని దేశ ఐక్యత పటిష్టం కావటానికి ఆమె ముఖ్యమంత్రి కావటం ఒక పరిష్కారంగా భావించాల్సి వస్తోంది. కాశ్మీర్ సమస్యకు కొన్ని ప్రత్యేక కారణాలున్నా కూడా.. అంతా కేంద్రమే, ఢిల్లీదే పెత్తనం అనే కేంద్రీకృత రాజకీయం, పాలనావ్యవస్థ కాశ్మీర్‌ని సంక్షోభంగా మార్చింది. స్థానిక ఆకాంక్షల్ని గుర్తించని జాతీయ పార్టీలు తమ ఆధిపత్యం కోసం కాశ్మీర్ కుంపటికి ఆజ్యం పోస్తూ వచ్చాయి. స్వయంప్రతిపత్తి ఆకాంక్షతో ఎన్నుకున్న స్థానిక నేతలు జాతీయ పార్టీలతో కుమ్మక్కయి చేసిన స్వార్థ రాజకీయాలతో కాశ్మీరీలు గాయపడటం ఉగ్రవాదులకు అవకాశం కల్పించింది. కాశ్మీర్‌కు పరిష్కారం లభిస్తున్న ప్రతిసారీ ఢిల్లీ నేతలు దుర్మార్గపు రాజకీయ క్రీడలాడారు. ఢిల్లీ పెత్తనాన్ని ప్రశ్నించి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలను సాధించటంలో, ఫెడరలిజాన్ని విస్తరించటంలో ఎన్‌టిరామారావు, బిజూపట్నాయక్, కరుణానిధి వంటి నేతలతోపాటు కాశ్మీర్ నాయకుల కృషి కూడా ఉంది. ఇలా ఫెడరలిజం పెరిగి రాష్ట్రాలు బలోపేతమవటం దేశ ఐక్యతకు దోహదం చేసింది. అయినా జాతీయ పార్టీలు మేలుకోలేదు. దేశ విభజన పరిస్థితుల నేపథ్యంలో మనం నిర్మించుకున్న కేంద్రీకృత వ్యవస్థ రాజ్యాంగాన్ని క్రమంగా వికేంద్రీకరించే ప్రయత్నం చేయకుండా, వీలున్నంతవరకూ తమ ఆధిపత్యాన్ని, దోపిడీ అవకాశాల్ని పరిరక్షించుకునే ప్రయత్నమే చేశాయి. రాజకీయాల్ని వ్యక్తుల ప్రైవేటు ఆస్తిగా మార్చి, అన్నిటికీ ప్రభుత్వం మీద ఆధారపడటమే తప్ప తలెత్తుకుని బతికే జీవితం మెజారిటీ ప్రజలకు లేకుండా చేశాయి. పౌరసత్వం, కిందిస్థాయి నుంచి నాయకత్వం ఎదగకుండా చేశాయి. ఫెడరలిజం విస్తరణ అసమగ్రంగా ఆగిపోవటం, మూడో అంచె ఫెడరలిజానికి అవకాశం లేకుండా చేయటం వల్ల గత 20 ఏళ్లుగా ప్రజల వాస్తవిక ఆకాంక్షలకు తగ్గ అభివృద్ధి లేకుండా దోపిడీ, విద్వేష రాజకీయాలు పెరిగిపోతున్నాయి. ప్రజల అసంతృప్తి, ఆవేదన వ్యాపార రాజకీయ నేతలకు ఇంధనంగా మారాయి. కాశ్మీర్, ఈశాన్య భారతంతోపాటు ఇటీవల పలు రాష్ట్రాల్లో కూడా పెరుగుతున్న ఈ పరిణామాలను భారత ప్రభుత్వం గుర్తించకపోతే ముమ్ముందు తీవ్ర పరిస్థితులు ఎదురవుతాయి. అందుకే ఫెడరలిజాన్ని పునర్నిర్వచించి విస్తరించటంలో భారత్ సాహసోపేతంగా, విప్లవాత్మక దృక్పథంతో వ్యవహరించాలి. పాలనా పద్ధతుల్లో, తమ పరిధిలోని అంశాల్లో రాష్ట్రాలకి పూర్తి స్వేచ్ఛ కల్పించాలి. సొంత రాజ్యాంగాలకు అనుమతించాలి. రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి వల్ల ఐక్యత, అభివృద్ధి పెరుగుతాయి. ఒకే మార్కెట్, కరెన్సీ, రక్షణ, జాతీయ భద్రత అంశాల్లో అన్ని అధికారాలనూ కేంద్రం వినియోగించవచ్చు. కానీ రాష్ట్రాల పాలనలో తలదూర్చి విధానాల అమలును పైనుంచి నిర్దేశించటం తగదు. ఏకీకృత వ్యవస్థ, ఒకే భాష కలిగిన బ్రిటన్‌లోని స్కాట్లండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌లోనే వివిధ రకాల ఎన్నికల, పాలనా పద్ధతులున్నాయి. రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి, జవాబుదారీతనం ఉంటే పరిష్కారాలు మెరుగవుతాయి. కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు ఈదేశంలో పూర్తిగా అంతర్భాగమవుతాయి. నూతన ఆలోచనలు పెరుగుతాయి. పేరుకి మాత్రమే కాకుండా నిజమైన జాతీయ సమగ్రత కలిగిన ఫెడరల్ రిపబ్లిక్ దేశంగా భారత్‌ను నిర్మించుకోవటానికి మనం ఇప్పటికైనా పూర్తిస్థాయిలో కృషి చేయాలి. 21వ శతాబ్దంలో జాతి నిర్మాణానికి కొత్త పోకడలు కావాలి.



# ఎజెండాను, రాజకీయ సంస్కృతిని చూడండి 'విజిల్' గుర్తుపై ఓటు వేసి లోక్‌సత్తాను గెలిపించండి




కార్పొరేటర్ నెలజీతం రూ. 12,000 అని, ఏడాదికి రూ. 1.44 లక్షలు, ఐదేళ్లలో 7.2 లక్షలు మాత్రమే అందుతాయని, అయినా గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందటానికి కోట్లు ఖర్చు చేయటానికి ఎందుకు సిద్ధమవుతున్నారో ప్రజలు తెలుసుకోవాలని గడ్డిఅన్నారం డివిజన్ లోక్‌సత్తా పార్టీ నాయకుడు డి. నరసింహ అన్నారు. ఇలా అధికార లాలసతో గత ఎన్నికలలో గెలిచిన అన్ని పార్టీల కార్పొరేటర్లూ ఎంత ప్రజాధనాన్ని ఎంత దుర్వినియోగం చేశారో, జనం డబ్బుతో ఎలా జల్సాలు చేశారో లోక్‌సత్తా సాక్ష్యాలతో బైటపెట్టిందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వ అధికార దుర్వినియోగం, ప్రచార లాలస వల్ల కోట్ల రూపాయలు వృథా అయ్యాయని లోక్‌సత్తా బైటపెట్టిన లెక్కలు నూరుశాతం వాస్తవమని తాజాగా అధికారులు ఎన్నికల కోడ్‌తో తొలగించిన సుమారు 90,000 అనధికార బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు రుజువు చేస్తున్నాయన్నారు. ప్రజలు వాస్తవాల్ని గుర్తించి స్వచ్ఛ రాజకీయాలకు, వార్డుల నుంచి నగర సమగ్రాభివృద్ధికి లోక్‌సత్తా, మిత్రపక్ష సీపీఎం, సీపీఐ అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా వార్డు స్థాయిలో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఖర్చుచేసేలా నేరుగా ఒక్కొక్కరి పేరు మీదా రూ. 2000 కేటాయించి ఖర్చు చేస్తామని, లోక్‌సత్తా, మిత్రపక్షాల ఎజెండాను – ఓట్ల కోసం తాయిలాలను ఊదరగొడుతున్న మిగిలిన పార్టీల ఎజెండాను పోల్చి చూసుకుని సరైన పార్టీకి, అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ ఎన్నికల గుర్తు 'విజిల్' (ఈల) పై ఓటు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ★




**జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ ఎన్నికల గుర్తు 'విజిల్'**

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రైతు ఘోష పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతులు సంఘటితమై వ్యవసాయాన్ని వ్యాపారంలా చేయాలి: జేపీ

రైతుల వల్ల లాభం పొందుతున్న ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు వారి సమస్యలను పట్టించుకోకపోగా దోచేస్తున్నారని, ప్రభుత్వాల నియంతృత్వంపై శాంతియుత పోరాటం సాగించి ప్రయోజనాలను సాధించుకునేందుకు రైతులు కులం, ప్రాంతం, పార్టీలు, పంటలకతీతంగా ఏకమవ్వాలని స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. రైతులకు అందాల్సిన విత్తనాలు, ఎరువులు నల్లబజారుకు తరలిపోతున్నాయని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతులు పంట పండించినా గిట్టుబాటు ధర లేకుండా పోతోందన్నారు. మద్దతు ధర రూ.1410 ఉంటే, రూ.950కి ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోందని, ఇంతవరకూ ఉత్తరాంధ్రలో ధాన్యం కొనుగోళ్లకేంద్రాలను కూడా పక్కాగా ఏర్పాటు చేయలేకపోయారని, జిల్లా కేంద్రాల్లో ఒక్క లారీ కూడా కొనలేదని అన్నారు. తడిసిన ధాన్యం కొనటానికి డ్రైయ్యర్లు లేవన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా విధానాలు మారకపోవటం వల్ల రైతుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుందన్నారు.




**రైతులకు అందాల్సిన విత్తనాలు, ఎరువులు నల్లబజారుకు తరలిపోతున్నాయని, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రైతులు పంట పండించినా గిట్టుబాటు ధర లేకుండా పోతోందన్నారు. మద్దతు ధర రూ.1410 ఉంటే, రూ.950కి ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోందని, ఇంతవరకూ ఉత్తరాంధ్రలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను కూడా పక్కాగా ఏర్పాటు చేయలేకపోయారని, జిల్లా కేంద్రాల్లో ఒక్క లారీ కూడా కొనలేదని అన్నారు. తడిసిన ధాన్యం కొనటానికి డ్రైయ్యర్లు లేవన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా విధానాలు మారకపోవటం వల్ల రైతుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుందన్నారు.**

శ్రీకాకుళం పట్టణంలో 'అన్నదాత-గుండెఘోష' పేరుతో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ, ఇందిరా విజ్ఞాన్ భవన్ ఆవరణలో జరిగిన సభలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

జేపీ మాట్లాడుతూ, రైతులంతా సంఘటితమై వ్యవసాయాన్ని వ్యాపారంలా చేయాలన్నారు. కనీసం ఆదాయం కోసం, మెరుగైన జీవితం కోసం ఎదురుచూస్తున్న రైతులైనా తమ భవిష్యత్తు కోసం సరైన విధానాలను తెలుసుకుని కలిసికట్టుగా పోరాడాలన్నారు. ప్రభుత్వాలు రైతులను జీవచ్ఛవాలుగా, ఓటుబ్యాంకులుగా కొనసాగించే వికృత రాజకీయ క్రీడకు పాల్పడుతున్నాయన్నారు. పంజాబ్‌లో ఇతర సమస్యలున్నా గోదాములు ఉండటం, కనీస మద్దతు ధరకు మార్కెట్ సదుపాయాలు వంటివి ఉండటం వల్ల రైతులకు కొంతయినా మెరుగైన జీవితం లభించిందని, కానీ ఇక్కడ ఆ మాత్రం చర్యలు కూడా లేకపోవటం వల్ల రైతులు తీవ్రంగా కుంగిపోతున్నారన్నారు. రైతే రాజు, దేశానికి వెన్నెముక వంటి బిరుదులతో మోసం చేయటం తప్ప తెలుగు రాష్ట్రాల్లో రైతులకు మేలుచేసేందుకు ఒక్కటంటే ఒక్క నిర్మాణాత్మక విధానాన్ని కూడా




పాలకులు అమలుచేయటం లేదన్నారు. రాష్ట్రంలో పండించే ధాన్యానికి మద్దతు ధర లభించేవరకు రైతులు సంఘటితంగా ఉద్యమించాలన్నారు.

సిక్కోలు జిల్లాలో సారవంతమైన భూములున్నాయని, పదిమందికీ మేలు చేసే విధంగా రైతులు కష్టపడుతున్నారని, అయినా ఫలితం దక్కటం లేదని జేపీ అన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా అవి బోర్డులకే పరిమిత మయ్యాయన్నారు. సెస్ ద్వారా వసూలు చేసిన డబ్బు కూడా రైతుల ప్రయోజనాలకు ఉపయోగపడటం లేదన్నారు. ధాన్యం విక్రయాల ద్వారా సెస్ రూపంలో ఒక్క శ్రీకాకుళం జిల్లాలో ఏటా రూ.80 కోట్ల ఆదాయం వస్తుందని, పది జిల్లాల్లో రూ.1000 కోట్ల వరకూ ఈ ఆదాయం వస్తుందని అన్నారు. అందులో నుంచి కేవలం రూ.8కోట్లు పెట్టుబడి పెట్టి ఉంటే, జిల్లాలో రైతులకు ఉపయోగపడే 50 డ్రైయ్యర్లు ఏర్పాటు చేయవచ్చన్నారు. సెస్‌ని ఏ లక్ష్యం కోసం వసూలు చేస్తున్నారో, ఆ లక్ష్యానికి ఖర్చు చేయాలని, ప్రభుత్వం గుప్పెట్లో ఉన్న మార్కెట్ యార్డుల్లో ప్రస్తుతం దళారుల దోపిడీ నడుస్తోందని, పార్టీల కార్యాలయాలుగా తయారయ్యాయని, వాటిలో పైరవీలతో పదవుల్ని పొందినవారు మీడియాలో ప్రచారానికి మాత్రం లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. మార్కెట్ యార్డుల్ని తక్షణం రైతులకి అప్పచెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఎక్కడ చైతన్యం వస్తుందోనని, బలపడతారోనని సహకార సంఘాలన్నిటినీ నాశనం చేశారని, పరపతి వ్యవస్థ సరిగా ఉంటేనే రైతులకు మేలు జరుగుతుందని జేపీ అన్నారు.

ప్రభుత్వమే రైతులను మోసం చేస్తూ వారికి రావలసిన వేలకోట్ల రూపాయలను స్వాహా చేయటానికి పత్తి కొనుగోళ్లే తాజా నిదర్శనమని జేపీ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 93 లక్షల క్వింటాళ్ల పత్తి పండిందని, ప్రభుత్వం మద్దతు ధరకరూ.4200 ప్రకటిస్తే, రాజకీయ నాయకులు దళారులతో కుమ్మక్కయి రూ.3200 చెల్లించి తప్పుడు రసీదులతో రూ.1000 కోట్ల వరకూ రైతులను దోచేశారన్నారు. వారి మీద ప్రభుత్వం చర్యలు కూడా తీసుకోలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగుల జీతాలకు


రైతులతో కరచాలనం చేస్తున్న జేపీ

రూ.38,000 కోట్లు ఖర్చు చేస్తోందని, కానీ వారి చేత కనీసం పనిచేయించలేకపోతోందన్నారు.

రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలను లోక్‌సత్తా చూస్తూ ఊరుకోదని, ఎండగడుతూ పరిష్కారాలపై రైతులను చైతన్యపరుస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమావేశాల్ని నిర్వహిస్తామని, దశలవారీ పోరాటం చేస్తామని జేపీ అన్నారు. రైతులకు అండగా తాము ఉంటామని, అయితే తమ కోసం తాము రైతులు కదలాలని అన్నారు. రైతుల కోసం పోరాడటానికి అమెరికా నుంచి వచ్చిన ప్రకాష్ కపిలను జేపీ అభినందించారు. కార్యక్రమాల్లో స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పంచాది రాంబాబు, లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ, జిల్లా అధ్యక్షుడు పోలినాయుడు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, రాజగోపాలరావు, సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బరాటం కామేశ్వరరావు, గజల్ కళాకారుడు ప్రధాన ఆదినారాయణ, అల్లు మల్లేశ్వరరావు, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ★

# రైతుల ఆత్మహత్యల్ని ఆపాలని నిజంగా అనుకుంటున్నారా మంత్రిగారూ?



గొప్ప ఆర్థికవేత్తలకు నిలయమైన మనదేశంలో రైతుల ఆత్మహత్యలు ఎందుకు ఎందుకు ఆగటంలేదో అందరూ ఆలోచించాలని తెలంగాణ ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ఇటీవల అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్థికనిపుణులను ఉద్దేశించి 'సెస్'లో మాట్లాడుతూ ఆయనీ అభిప్రాయం వ్యక్తం చేశారు. మంత్రిగారు సదుద్దేశంతోనే అన్నా, ఇది చాలా బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్య. రాజేందర్ శాసనసభలో ఉన్నప్పుడే లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నిర్దిష్టమైన వ్యవసాయ విధానాలతో పోరాడారు. పలుమార్లు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతు ఐక్యతా యాత్రలో భాగంగా తెలంగాణలో మార్కెట్ యార్డుల దుస్థితిని బైటపెట్టి ఎండగట్టారు. సిద్దిపేటలో మార్కెట్ యార్డు తాళం తెరిపించారు. మార్కెట్ యార్డులను బాగు చేయటానికి డ్రైయర్లు, గోదాములు, టార్పాలిన్లు, టాయిలెట్లు సహా మౌలిక వసతుల్ని కల్పించాలని, యార్డులలో రాజకీయ జోక్యం లేకుండా రైతులకే అప్పచెప్పి, వారి నుంచి వసూలు చేసిన సెస్సుని వారి పంటల ధరల పెంపు కోసమే ఉపయోగించాలని జేపీ స్పష్టంచేశారు. పంట ఉత్పత్తుల రవాణాపై ఆంక్షల్ని తొలగించాలంటూ 2012లో కర్నూలు నుంచి కర్ణాటకకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు బియ్యం మూటల్ని తీసుకెళ్లి అమ్మి రైతులకు, వ్యాపారులకు భరోసా కల్పించారు. దీనివల్ల ఆ ఏడాది ఒక్క బీపీటీ వెరైటీలోనే తెలుగు నాట రైతులకి రూ.3600 కోట్ల లాభం చేకూరింది. అలాగే పత్తి ఎగుమతులను అడ్డుకునేందుకు తమిళనాడు నేత కరుణానిధి చేసిన ప్రయత్నాల్ని హేతుబద్ధంగా నిరోధించి, ఎగుమతులు కొనసాగేలా చేశారు. దీనివల్ల పత్తి ధర రికార్డుస్థాయిలో రూ.7,000-8,000కి చేరింది. రుణమాఫీ పరిష్కారం కాదు, ఆ డబ్బుతోనే రైతులకు ఆదాయం పెరిగే చర్యలు చేపట్టాలని 2014 ఎన్నికల సమయంలో జేపీ ఎన్నిసార్లు చెప్పలేదు? ఉచిత విద్యుత్తుకి నామమాత్రపు ధరతో మీటర్లు పెట్టండి, ప్రాణహిత-చేవెళ్ల వంటి భారీ ఎత్తిపోతల పథకాలతో తెలంగాణకు గుదిబండల్ని తయారుచేయబోకండి అని లెక్కలేనన్ని సార్లు జేపీ హితవు చెప్పారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా జేపీ చాలా స్పష్టంగా రైతుల ఆత్మహత్యలకు విద్య, ఆరోగ్య రంగాలలో భారం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఎలా కారణమవుతున్నాయో వివరిస్తూ, నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఉచితంగా అందించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా సర్వీస్ గ్యారంటీ చట్టం తేవాలని ప్రభుత్వానికి తెలియచేశారు. రైతుల ఆత్మహత్యలు ఆపాలని మీకు చిత్తశుద్ధి ఉంటే వీటిని వెంటనే అమలు చేయండి. మిగిలిన సంస్కరణల్ని తర్వాతి దశలో చేయవచ్చు. పరిష్కారంలో భాగమవటానికి లోక్‌సత్తా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. కానీ, కనీసం మార్కెట్‌యార్డుల్ని మీ పార్టీ నేతలు కబ్జా చేస్తున్నా మాట్లాడకుండా, రైతుల ఆత్మహత్యలకు విధానాలు లేవనటం ఆడ లేక మద్దెల ఓడు అన్న చందంగానే ఉంటుంది. ★

## అంగన్‌వాడీలపై కక్షసాధింపు చర్యలను సహించం

**కావలి:** అన్నమో రామచంద్రా అన్న పాపానికి అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు చర్యలను ప్రదర్శిస్తోందని, ఇలాంటి చర్యలను సహించబోమని లోక్‌సత్తా పార్టీ నేత గడ్డం సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. సమస్యల పరిష్కారం కోసం గళమెత్తినవారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని చూడటం తగదన్నారు. అంగన్‌వాడీలపై కక్షసాధింపు చర్యల్ని వెంటనే ఆపాలని, పెంచిన వేతనాలను అందరికీ వెంటనే వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ★

# జీహెచ్ఎంసీలో స్వచ్ఛ రాజకీయాలకు లోక్‌సత్తా, సీపీఎం, సీపీఐ 'వన్ హైదరాబాద్' కూటమి, ఎన్నికల కనీస ఉమ్మడి ఎజెండా విడుదల



**2016** గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్వచ్ఛ రాజకీయం తెచ్చి హైదరాబాదీలకు అవినీతి రహిత పాలన అందించేందుకు స్వచ్ఛ జన రాజకీయానికి నాంది పలికిన లోక్‌సత్తా పార్టీతో కలిసి నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడే భావసారూప్య వామపక్షాలు సీపీఎం, సీపీఐ 'వన్ హైదరాబాద్' కూటమిని ఏర్పాటు చేశాయి.

మూడు పార్టీల నేతలూ సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో మీడియాకు ఈ వివరాలను వెల్లడిస్తూ తమ కూటమి కనీస ఉమ్మడి ఎజెండాను విడుదల చేశారు. లోక్‌సత్తా నుంచి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, జాతీయ కమిటీ నేతలు తారా కృష్ణస్వామి, శ్రీనివాస్ ఎ, సీపీఎం నుంచి కార్యదర్శులు ఎం. శ్రీనివాస్, ఎన్. సోమయ్య, కె. రవి, సీపీఐ నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యుడు అజీజ్‌పాషా, కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

"అవినీతి లేకుండా, పారదర్శకంగా, తమ ప్రాంతంలో తమకు ఎలాంటి పాలన కావాలో ప్రజలే చెప్పే ఏర్పాటున్న ఎజెండా కలిగిన 'వన్ హైదరాబాద్' కూటమితోనే భద్రమైన, ఆధునికమైన, అందమైన, సుఖసంతోషకరమైన హైదరాబాద్ సాధ్యమవుతుంది తప్ప బూజుపట్టిన, భూస్వామ్య, అవినీతి టీఆర్ఎస్, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ తదితర పార్టీలతో కాదు. ఆ పాత రాజకీయ పార్టీలిస్తున్న ఆకర్షణీయ హామీలన్నీ మురికి మూసీలో అత్తరు జల్లే కార్యక్రమం లాంటివే. ఆ పార్టీలకు ఓటు వేయటమంటే, మురికి మూసీని ప్రక్షాళన చేయకుండా అత్తరు వాసనలు బాగున్నాయని మోసపోవటమే. ఆ మురికి, పాత రాజకీయాల పార్టీలకు ప్రత్యామ్నాయం.. గలగల పారే స్వచ్ఛమైన మూసీ లాంటి రాజకీయం, పాలన అందించే 'వన్ హైదరాబాద్' కూటమి" అని లోక్‌సత్తా, సీపీఎం, సీపీఐ నేతలు పేర్కొన్నారు.

'వన్ హైదరాబాద్' నేతలు విడుదల చేసిన కూటమి జీహెచ్ఎంసీ ఎన్నికల కనీస ఉమ్మడి ఎజెండా:

1. స్థానిక ప్రజలకే అధికారం: తమ ప్రాంతాలలో జీహెచ్ఎంసీ ఎటువంటి సదుపాయాలను కల్పించాలో, ఏమేం మరమ్మతులు చేయాలో నిర్ణయించే అధికారం స్థానిక ప్రజల అసోసియేషన్లు, కాలనీలు, బస్తీల బృందాలకే అప్పచెప్పటం

2. ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా ప్రజలకు సేవలు: ప్రజలకు రోజువారీ అందించాల్సిన ధ్రువపత్రాలు, రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు, నల్లా కనెక్షన్లు, భూ రికార్డులు వంటి సేవలకు నిర్ణీత కాలవ్యవధి ఏర్పాటు చేసి, గడువులోగా చేయకపోతే ప్రభుత్వం రోజుకు రూ. 250 పరిహారం దరఖాస్తుదారునికి చెల్లించే సర్వీస్ గ్యారంటీ చట్టం తేవటం

3. మహిళలకు అత్యంత సురక్షిత నగరంగా మార్చటం: మహిళలు మాత్రమే ఉండే పోలీసు స్టేషన్ల ఏర్పాటుతోపాటు నగర పోలీసు దళంలో మహిళల సంఖ్యను పెంచటం. సున్నితమైన ప్రాంతాలన్నిటిలో సీసీటీవీల ఏర్పాటుతోపాటు

మహిళలపై ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు వంటి నేరాలను వేగంగా విచారించి కఠిన శిక్షలను విధించే ఏర్పాటు

4. ట్రాఫిక్, కాలుష్య సమస్యల బారి నుంచి రక్షణ: కాలుష్యంలో ఢిల్లీ, బెంగళూరులా తయారవుతున్న ప్రమాదం నుంచి హైదరాబాదీలకు రక్షణ కల్పించేందుకు సౌకర్యవంతమైన, వేగవంతమైన ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసి నగర బస్సులు, రైళ్లు అన్నిటిలో ఒకే టికెట్ వ్యవస్థను అమలుచేయటం

5. నగరంలోని రోడ్లకూ జాతీయ రహదారుల నాణ్యత: నగరంలోని రోడ్ల కాంట్రాక్టుల్లో "పర్సంటేజీ"ల పద్ధతిని నిర్మూలించి జాతీయ రహదారుల స్థాయి నాణ్యత, భద్రతా ప్రమాణాలతో, ఫుట్‌పాత్‌లతో నిర్మించటం

6. హక్కుగా మంచినీరు: "ట్యాంకర్ మాఫియా"ని ప్రక్షాళన చేసి నగరంలో ప్రతి ఇంటికీ హక్కుగా మంచినీరు అందించే పక్కా వ్యవస్థ

7. మెరుగైన పారిశుద్ధ్యం, చెత్తనిర్వహణ: చెత్త నిర్వహణ మాఫియాను కూడా నిర్మూలించేందుకు రీ సైక్లింగ్‌ను అమలు చేయటం. ప్రతి ప్రాంతంలో సక్రమంగా పనిచేసే ప్రజా టాయిలెట్లను నిర్మించటం

8. అందుబాటులో అందరికీ ఇల్లు: పేదలు ఆత్మగౌరవంతో బతికేలా తక్కువ ఖర్చుతో నగరంలో అందరికీ ఇల్లు పథకం అమలు, ఎప్పటి నుంచో నివసిస్తున్నవారికి క్రమబద్ధీకరణ, భూకబ్జాల నిరోధానికి కఠిన చర్యలు, మురికివాడల అభివృద్ధి బోర్డు ఏర్పాటు

9. గ్రీన్ సిటీ: పార్కులు, ఆటస్థలాలన్నిటినీ కబ్జాల నుంచి విముక్తి చేసి వాటి సంఖ్యను పెంచటం. అందమైన పార్కుల నిర్మాణం, పిల్లలు ఆడుకునేందుకు కావలసిన వసతుల్ని పెంపొందించటం

10. పాతనగరం అభివృద్ధి: పాతనగరం ఘనవారసత్వాన్ని పరిరక్షిస్తూనే ఆధునీకరించటం, పర్యాటకాన్ని ప్రోత్సహించటం. ★

# లోక్‌సత్తాతోనే మార్పు సాధ్యం, గెలిపించండి

## -ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల-



సమావేశంలో పాల్గొన్న ఆకెళ్ల రాఘవేంద్ర

సమాజంలో మార్పు తెచ్చి, వంశపారంపర్య రాజకీయాల స్థానంలో సామాన్య యువతీయువకులకు అవకాశమిచ్చే కొత్త రాజకీయం లోక్‌సత్తా పార్టీతోనే సాధ్యమని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఆకెళ్ల రాఘవేంద్ర అన్నారు. ధన రాజకీయాలను ప్రజలు గమనించి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రశ్నించి, పరిష్కరించగల లోక్‌సత్తా పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో జరిగిన లోక్‌సత్తా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవీప్రసాద్ మాట్లాడుతూ, రాజకీయాల్లో భూదందాలు, అవినీతి కాంట్రాక్టులకు పాల్పడే వారికే తప్ప సమస్యల్ని పరిష్కరించే వారికి అవకాశాలు రావటం లేదని, ఇది అన్ని వర్గాల ప్రజలకూ మున్ముందు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. వ్యవస్థలో మార్పు తెచ్చేందుకు యువత ముందుకు రావాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా నేతలు శ్రీనివాసరెడ్డి, సతీష్, అంజయ్య, శివకుమార్, దొంతినేని నరసింహ, జకీర్ తదితరులు పాల్గొన్నారు. ★

# మురికివాడల్ని పెంచుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా 'బస్తీమే బైస్కిల్' యాత్ర

మురికివాడలు లేని హైదరాబాద్ కోసమంటూ పాలకులు వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసినా నగరంలో మురికివాడలు ఇంకా పెరిగాయని లోక్‌సత్తా పార్టీ ధ్వజమెత్తింది. అవినీతి లేకుండా బస్తీల్ని, మురికివాడల్ని అభివృద్ధి చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి అన్నారు. 'మురికివాడల అభివృద్ధి' నినాదంతో ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి లోక్‌సత్తా పార్టీ బస్తీ మే బైస్కిల్ పేరుతో సైకిల్ యాత్రని ప్రారంభించింది. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ, 1974 నుంచి వివిధ దేశాల నుంచి, ప్రపంచబ్యాంకు నుంచి తీసుకున్న నిధులు, కేంద్ర ప్రభుత్వం నుంచి వాంబే, జేఎన్ఎన్‌యూఆర్ఎం, రాజీవ్ ఆవాస్ యోజన వంటి పథకాల ద్వారా వచ్చిన డబ్బు, జీహెచ్ఎంసీ యూసీడీ పథకం ద్వారా ఖర్చు చేసిన రూ. 1667కోట్లు కలిపి మొత్తం రూ. 4200 కోట్లు మురికివాడల అభివృద్ధికి ఖర్చు చేసినట్టు అధికారిక లెక్కలే చెబుతున్నాయన్నారు. అయినా జీహెచ్ఎంసీలో మురికివాడలు 662 నుంచి 965కి పెరిగాయని, 2012 సర్వే ప్రకారం 1476 అయ్యాయని, ఇప్పుడు 1504కి పెరిగాయని అన్నారు. ప్రజలకోసం రొటీన్‌గా చేసే చిన్నచిన్న మానవీయ సహాయాలకు కూడా సొంత సొమ్మేదో దానమిచ్చినట్టు



ఫోటోలకు ఫోజులిచ్చి ప్రచారం చేసుకోవటం, వీలైనంత దండుకోవటం తప్ప.. మురికివాడలు లేని నగరంగా చేయటానికి కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నా ఫలితాలు ఎందుకు రావటంలేదని చర్చించే ప్రయత్నం కూడా నగరపాలక సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం చేయటం లేదన్నారు. మురికివాడల నిర్మూలనకు కీలకమైన నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు వంటి వాటి కోసం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయటం లేదనటానికి ఈ లెక్కలే నిదర్శనమన్నారు. మురికివాడలు లేని నగరంగా హైదరాబాద్‌ను తయారుచేయటానికి తగిన విధానాలతో ఇప్పటికైనా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, అలాంటి నాయకులనే ప్రజలు ఎన్నుకోవాలని అన్నారు. ★

# ప్రచారం కోసం వృద్ధుల ఆసరాకూ ఎసరు



ఆసరా పథకంలో చేతికర్రల కోసం కేవలం రూ. 24 వేలు ఖర్చు చేసి, ఆ పథకాన్ని ప్రచారం చేసుకునేందుకు మాత్రం లక్షల రూపాయలను తెలంగాణ ప్రభుత్వం వెదజల్లిందని లోక్‌సత్తా పార్టీ ఆరోపించింది. వృద్ధుల ఆసరానీ ప్రచారం కోసం దుర్వినియోగం చేసిన కేసీఆర్ ప్రభుత్వ తీరును ప్రజలకు తెలియచేసేందుకు లోక్‌సత్తా నేతలు చేతికర్రలతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ప్రచార పిచ్చిని తగ్గించుకుంటే దుబారా తగ్గుతుందన్నారు. ప్రజాశ్రేయస్సుకి విధానాలు, కార్యక్రమాలపై సర్కారు ఇకనైనా దృష్టి పెట్టాలన్నారు.

ఈ కార్యక్రమాల్లో లోక్‌సత్తా నేతలు గంగాభవాని, అనుమోలు రాఘవయ్య, దేవీప్రసాద్, జగన్ మెట్ల, నారాయణ రెడ్డి, లింగరాజు, నందు, గంగాధర్, శివశంకర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ★

# గెలిపిస్తే బస్తీలకే నిధులిస్తాం, బోర్డు ఏర్పాటుతో అభివృద్ధి చేస్తాం: లోక్‌సత్తా



గ్రేటర్ హైదరాబాద్‌లో లోక్‌సత్తా, వన్ హైదరాబాద్ మిత్రపక్షాలను గెలిపిస్తే బస్తీలకే నిధుల్ని నేరుగా అందిస్తామని, బస్తీల అభివృద్ధికి ప్రత్యేక బోర్డుని ఏర్పాటు చేస్తామని పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బంతు సాంబిరెడ్డి అన్నారు. బస్తీల అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోతో ప్రజల వద్దకు వస్తున్నట్టు చెప్పారు. కవాడిగూడ డివిజన్ సాయినగర్ బస్తీలో దోసపాటి రాము, సాంబిరెడ్డి పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం వారు మాట్లాడుతూ, బస్తీల అభివృద్ధికి ఇప్పటివరకూ ప్రభుత్వాలు ఏమాత్రం చిత్త శుద్ధితో పనిచేయలేదన్నారు. అందుకే బస్తీల సంఖ్య తగ్గకపోగా ఏటా పెరుగుతోందన్నారు. బస్తీలలో జనాభా ప్రాతిపదికన నేరుగా నిధుల్ని కేటాయిస్తే సమస్యలు వెంటనే అవినీతి లేకుండా పరిష్కారమవుతాయన్నారు. కేంద్రం నుంచి జనాభా ప్రాతిపదికన నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న మంత్రి కె.తారకరామారావు, ఆ నిధుల్ని ప్రజల చేతికివ్వకుండా తమ గుప్పెట్లో పెట్టుకుని సొంత ప్రయోజనాలకనుగుణంగా విదులుస్తున్నామంటున్నారన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా ఎంత ఆదాయం తీసుకుందో, ఎంత ఖర్చు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అవినీతి రాజకీయాన్ని, ఉద్యోగ వ్యవస్థను ప్రోత్సహించే ఆ పాత రాజకీయపార్టీలను తిప్పికొట్టి, అధికారాన్ని, నిధులను నేరుగా బస్తీల్లోకి జనం చేతికిచ్చే లోక్‌సత్తా, వన్‌హైదరాబాద్ మిత్రపక్షాలను గెలిపిస్తేనే ఈసారైనా హైదరాబాద్‌లో మౌలికమార్పు సాధ్యమై విశ్వనగరంగా మారుతుందని అన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు కొంగర గంగాధరరావు, రాఘవేంద్ర, ఉమేష్, వాసు, వినోద్, నవీన్, లక్ష్మణ్, రఘు తదితరులు పాల్గొన్నారు. ★

# ఇంటింటికీ లోక్‌సత్తా



హైదరాబాద్ నేరేడ్‌మెట్ డిఫెన్స్ కాలనీ పరిధిలోని వెస్ట్ కాకతీయనగర్‌లో లోక్‌సత్తా పార్టీ డివిజన్ అధ్యక్షురాలు కె.సూర్యలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికి లోక్‌సత్తా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ గ్రేటర్ మునిసిపల్ ఎన్నికలలో లోక్‌సత్తాకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారాలను, పార్టీ జీహెచ్‌ఎంసీ ఎన్నికల ఎజెండాను వివరించారు. అనంతరం సూర్యలక్ష్మి మాట్లాడుతూ, గతంలో ఉన్న కార్పొరేటర్లు ప్రజల సమస్యలను పట్టించుకోలేదని, కనీసం ఉన్న నిధులను సక్రమంగా వినియోగించే ప్రయత్నం చేయలేదని అన్నారు. ప్రజాసమస్యలను పట్టించుకోని పార్టీల నేతలను, ఫిరాయింపులతో పాత నేతల్ని కొత్తగా చూపించే ప్రయత్నం చేస్తున్న పార్టీ అభ్యర్థులను ఎన్నుకోవటం వల్ల ప్రజలకు ఏమీ ఉపయోగం ఉండదన్నారు. సమస్యలను పరిష్కరించే శక్తి లోక్‌సత్తా ఎజెండాకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు వై.మురళీధర్, రంగాచార్యులు, శివరామకృష్ణ, శ్యాం ప్రవీణ్, నిఖిల్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. ★

# స్వచ్ఛ రాజకీయాలు, సమగ్రాభివృద్ధికి 'వన్ హైదరాబాద్' కూటమినే గెలిపించండి

- ఎం. శ్రీనివాస్
సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి



స్వచ్ఛమైన రాజకీయాలతో హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ లోక్‌సత్తా, సీపీఎం, సీపీఐ పొత్తు కుదుర్చుకుని 'వన్ హైదరాబాద్' కూటమిగా జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో పోటీ చేస్తున్నాయి. సాంప్రదాయ రాజకీయ కూటమికి ప్రత్యామ్నాయంగా వన్ హైదరాబాద్ కూటమి ఉంటుంది. ప్రజలు వన్ హైదరాబాద్‌ని ఆదరించాలి.

ప్రస్తుతం వన్ హైదరాబాద్ కూటమిలో లోక్‌సత్తా, సీపీఎం, సీపీఐ ఉన్నాయి. ఎంసీపీఐ(యు) కూడా కూటమిలో ఉంటామని ప్రకటించింది. మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తున్న వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా కూడా ఈ కూటమిలో చేరే అవకాశముంది.

కాలనీ అసోసియేషన్లతోపాటు అభ్యుదయ, ప్రజాతంత్ర సంఘాలను మా కూటమికి మద్దతివ్వాలని కోరాం. దీనికి మెజారిటీ సంఘాలు అంగీకారం తెలిపాయి. అందరి సహకారంతో జీహెచ్‌ఎంసీలో 150 స్థానాల్లోనూ పోటీ చేస్తాం.

ప్రధాన రాజకీయ పార్టీలు చేసే కొన్ని పనులతో రాజకీయాలంటే అవలక్షణాలతో కూడినవనే భావం కొంతమంది ప్రజల్లో ఉంది. ప్రస్తుతమున్న పార్టీలు కూడా సిద్ధాంతం, విధానం లేకుండా అధికారం కోసం ఎలాంటి చేర్పులు మార్పులనైనా చేసుకుంటున్నాయి. ఇలాంటి పార్టీలకు ప్రత్యామ్నాయంగానే 'వన్ హైదరాబాద్' కూటమి ఏర్పడింది. నిరంతరం ప్రజల కోసం పోరాడే పార్టీలుగా వామపక్షాలు, లోక్‌సత్తాలకు ప్రజల్లో గుర్తింపు ఉంది.

స్థానిక ప్రజలకే అధికారం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా ప్రజలకు సేవలు, ట్రాఫిక్, కాలుష్య నగరాన్ని మార్చటం, హక్కుగా మంచినీరు అందించటం, ఓల్డ్ సిటీని అభివృద్ధి చేయటం తదితర అంశాలను మా వన్ హైదరాబాద్ ఎజెండాలో పేర్కొన్నాం. ఇందులో భాగంగా 1700 మురికివాడల అభివృద్ధికి బోర్డును ఏర్పాటు చేసి పాలన చేస్తాం. పేదలు ఆత్మగౌరవంతో బతికేలా తక్కువ ఖర్చుతో అందరికీ ఇండ్ల పథకం అమలుచేస్తాం.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను, నీటి పన్ను తదితరాలను మాఫీ చేసింది. వీటిని తెలంగాణ మొత్తం కాకుండా హైదరాబాద్‌లోనే ఎందుకు చేశారంటే, ఎన్నికల కోసమే అని స్పష్టంగా అర్థమవుతుంది. నగరంలో రెండు లక్షల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తామని కేసీఆర్ చెప్పారు. కానీ ఇప్పటివరకూ కేవలం 396 మాత్రమే కట్టించారు.

తెరాస, ఎంఐఎం ఈ ఎన్నికల్లో కలిసే పోటీచేస్తున్నాయి. కానీ పైకి చెప్పే ధైర్యం మాత్రం లేదు. గెలవటానికి ప్రజల్ని మోసం చేయటానికి వారు వెనకాడరు.

రాష్ట్రంలో తెలుగుదేశం పూర్తిగా దెబ్బతింది. దేశవ్యాప్తంగా వరస పరాజయాలతో బీజేపీ నైరాశ్యంలో ఉంది. ఈ క్రమంలో ఆ పార్టీలు నగరంలో పెద్దగా ప్రభావం చూపే అవకాశాలు లేవు. ఆ పార్టీలు తెరాస, ఎంఐఎంలను విమర్శించటం మినహా వేరే ఏమీ చేయటం లేదు. శాసనసభ ఫలితాల షాక్ నుంచి కాంగ్రెస్ ఇంకా కోలుకోలేదు. దానికితోడు ఆ పార్టీలు లుకలుకలు పెరిగాయి.

స్వచ్ఛ రాజకీయాల కోసం, నగర సమగ్రాభివృద్ధి కోసం వన్ హైదరాబాద్ కూటమి జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీచేస్తోంది. పేద, మధ్య, ధనిక ఇలా అన్ని తరగతుల ప్రజలూ ఈ కూటమిని ఆదరించండి. నగరం అభివృద్ధి కేవలం నిస్వార్థంగా ప్రజా సమస్యలపై పోరాడే ఈ కూటమిలోని పార్టీలకే సాధ్యం. కాబట్టి నగర మేధావులు, విద్యావంతులు అందరూ వన్ హైదరాబాద్ కూటమి అభ్యర్థులనే గెలిపించాలని కోరుతున్నాం. ★

# సేవ చేసేవారిని సత్కరించే థ్యాంక్‌బండ్‌గా ట్యాంక్‌బండ్‌ని తయారుచేద్దాం




సమాజానికి సేవ చేసేవారిని గుర్తించి ప్రోత్సహించటానికి అనువైన వేదికగా సరూర్‌నగర్ ట్యాంక్‌బండ్‌ని థ్యాంక్ బండ్‌గా మార్చుకుందామని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. పలువురు లోక్‌సత్తా నాయకులు, యువకులతో ఆయన ట్యాంక్‌బండ్‌పైకి చేరుకుని థ్యాంక్ బండ్ ప్లకార్డులను ప్రదర్శించారు. వ్యక్తిసుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానించటం లోక్‌సత్తా లక్ష్యమని, ప్రతివారూ ఏదోకరూపంలో తమ పరిధిలో సమాజానికి సేవ చేయటాన్ని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేస్తున్నామని ఈ సందర్భంగా రాము చెప్పారు. అలాంటి వ్యక్తులను గుర్తించటానికి ప్రత్యేక రోజుగానీ, వేదికగానీ లేకపోవటంతో తాము ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా సమాజానికి మేలు చేసేవారిని గుర్తించి ప్రతి నెలా మొదటి ఆదివారం రోజున ఈ వేదిక వద్ద ప్రోత్సహిస్తూ అభినందించనున్నట్టు చెప్పారు. అలాగే ఏటా జనవరి మొదటి ఆదివారం రోజున కూడా భారీ కార్యక్రమం ఏర్పాటుకి రూపకల్పన చేయనున్నట్టు వివరించారు. సరూర్‌నగర్ ట్యాంక్‌బండ్‌పై రెండు చేతులూ జోడించి నమస్కరించే భారీ చిహ్నాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను సర్కారు దృష్టికి తీసుకెళ్తామన్నారు. దిల్‌షుక్‌నగర్ జంట పేలుళ్ల ఘటనలో బాధితులకు తక్షణ రవాణా సదుపాయం కల్పించిన ఆర్టీసీ డ్రైవర్ జానీ పాషాతో పాటు పలుమార్లు రక్తదానం చేసి పలువురికి ప్రాణసహాయం చేసిన ఏడుకొండలుని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ సీనియర్ నాయకుడు ఎంఆర్‌కే రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సతీష్‌తో పాటు సత్తయ్య, నర్సింహ, అంజయ్య, జకీర్ తదితరులు పాల్గొన్నారు. ★

# సంక్షోభాన్ని గుర్తించని చంద్రబాబు



విజయనగరం జిల్లా ప్రజలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా, వాస్తవ పరిస్థితులను గుర్తించటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెదేపా నేతలు విఫలమయ్యారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. జిల్లాకు వచ్చిన ప్రతిసారీ చంద్రబాబు ప్రజలకు మాయమాటలు చెబుతూ మోసపుచ్చుతున్నారన్నారు. ధాన్యం కొనక, చెరకుకు గిట్టుబాటు ధరలేక రైతులు, జూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడటం వల్ల కార్మికులు ఇబ్బందిపడుతున్నా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవటం లేదన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో బాబ్జీ పాల్గొన్నారు. జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు విషయంలో ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అనంతరం లోక్‌సత్తా పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై బాబ్జీ సమీక్షించారు. పార్టీ సీనియర్ నాయకుడు రమణానందం మాట్లాడుతూ, రైతులు, సామాన్య ప్రజలు అల్లాడిపోతుంటే గాల్లో నిచ్చెనలు వేస్తూ చంద్రబాబు ప్రభుత్వం మభ్యపెడుతోందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు అల్లం ప్రభాకర్, ఆకుల దామోదర్, కృష్ణారావు, పద్మాకర్, పెతకంశెట్టి శ్రీను, సత్యం, వర్రి విష్ణు, సత్యనారాయణ, రామలక్ష్మి, బూర్లె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ★

# తెలంగాణలో సగానికిపైగా పిల్లలకు అందని టీకా రక్షణ

తెలంగాణ రాష్ట్రంలో శిశుసంరక్షణ పథకాలు నీరుగారి పోతున్నాయి. సగానికిపైగా చిన్నారులు రోగనిరోధక టీకాలు పొందటం లేదు. ఏడాదిలోపు పరిపూర్ణంగా రోగనిరోధక టీకాలు పొందుతున్న పిల్లలు కేవలం 47.5శాతమే. దేశవ్యాప్తంగా టీకాలు పొందుతున్న చిన్నారులు సుమారు 65శాతం ఉన్నారు. రాష్ట్రంలో రోగనిరోధక టీకాల అమలును పరిశీలిస్తే, 72.3శాతంతో వరంగల్ జిల్లా అగ్రస్థానంలో ఉంది. రంగారెడ్డి 35.5శాతంతో అట్టడుగున ఉంది. జిల్లా స్థాయి గృహసేకరణ (డీఎస్‌హెచ్ఎస్) నివేదిక వెల్లడించిన దిగ్భ్రాంతికర వాస్తవాలివి. ఆసుపత్రి నుంచి తల్లీబిడ్డ ఇంటికెళ్లాక వారికి నిర్దేశించిన తేదీల ప్రకారం టీకాలను వేసే విధానం అధ్వాన్నంగా అమలవుతోంది. టీకాలపై గ్రామీణ ప్రాంతాలలో ఉన్న అపోహల్ని తొలగించటానికి ప్రచారం కూడా అంతంతమాత్రంగానే జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఏటా సుమారు 2.7కోట్ల మంది శిశువులు పుడుతుండగా, రాష్ట్రంలో ఆ సంఖ్య సుమారు6.28 కోట్లుగా ఉంది. టీకాలు వేస్తే జ్వరం, విరేచనాలు వస్తాయని అపోహ పడేవారు 37శాతం ఉన్నారు. 33శాతం మంది చిన్నారులు ప్రయాణాల్లో ఉండటం, తల్లిదండ్రులు వలసలు పోవటం వల్ల కూడా టీకాలు తీసుకోలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితిపై దృష్టిసారించిన కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో 'మిషన్ ఇంద్రధనుస్సు' పేరుతో గతేడాది సమగ్ర టీకా కార్యక్రమాన్ని ప్రారంభించింది. తెలంగాణలో మొదటి విడతగా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అమలుచేశారు. రెండో విడతలో మిగిలిన జిల్లాల్లోనూ అమలుచేసి 2.65లక్షల మంది పిల్లలకు టీకాలు పరిపూర్ణంగా ఇప్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.


### ఆరోగ్య మిషన్ నిధుల వినియోగం 32శాతమే

కాగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద 2015-16కి తెలంగాణకు రూ.1105 కోట్లు మంజూరు చేయగా డిసెంబర్ వరకు కేవలం రూ.350కోట్లు (32శాతం) ఖర్చు చేశారు. ఇందులో జీతాలు, భవనాల నిర్మాణం పోగా నికరంగా ప్రజల కోసం ఖర్చు చేసింది కేవలం రూ.130కోట్లు.




వీటిలో టీకాలకు ఎక్కువగా ఖర్చుపెట్టినట్టు చూపుతున్నా, అమలు ఎంత అధ్వాన్నంగా ఉందో లెక్కలు చూపుతున్నాయి. విద్య, వైద్య రంగాల పట్ల, స్థానిక సాధికారత పట్ల శ్రద్ధ లేకుండా యజ్ఞ యాగాదులే పరిష్కారమన్నట్టు చేస్తున్న పాలనతో ప్రత్యేక తెలంగాణలో కూడా ప్రజలు నష్టపోతున్నారు. తెలంగాణలో ఎన్‌హెచ్ఎం కింద అమలవుతున్న రోగనిరోధక టీకాలు, పట్టణ ఆరోగ్యం, మాతాశిశు సంరక్షణ, ఆశా ఆరోగ్య కార్యకర్తలు, బాల సురక్షా, కుటుంబ నియంత్రణ, గిరిజన ఆరోగ్యం నత్తనడకన సాగుతూ నిధులు మురిగిపోతున్నాయి. నిధులు వినియోగించటానికి మరో మూడు నెలలు మాత్రమే గడువు ఉంది. జాతీయ ఆరోగ్య మిషన్ కింద మొదటి విడతగా నాలుగైదు నెలల కింద కేంద్ర ప్రభుత్వం రూ.171 కోట్లు రాష్ట్ర ఖజానాకు విడుదల చేసింది. దీనికి తెలంగాణ ప్రభుత్వం రూ.100 కోట్లు జత చేసి ఆరోగ్య మిషన్ ఖాతాలో జమ చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ అవి జమ చేయలేదు. గత ఏడాది వరకు కేంద్రం, రాష్ట్ర వాటాలు 75:25గా ఉండేవి, ఈ ఏడాది నుంచి ఆ నిష్పత్తిని 60:40గా మార్చారు. మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో నిధుల వినియోగం సాధ్యంకాకపోవచ్చని, అయితే కేంద్రం వద్ద పలుకుబడి ఉపయోగించి గతంలో చేసినట్టే పాత నిధుల్ని కొత్త ఏడాది వినియోగించుకుంటామని కొందరు అధికారులు ఈ విషయాన్ని తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. అయ్యా, కేంద్రం, మీరు రాజకీయ లాలూచీ పడి ఎన్నయినా చేయవచ్చు, పాత నిధుల్ని కొత్తగా వినియోగించుకోవచ్చు, కానీ మాతాశిశువులకు, ఇతర ప్రజానీకానికి వచ్చే ఆరోగ్యసమస్యలు వచ్చే ఏడాది వరకూ వాయిదాపడి మీరు నిధులు కేటాయించి సేవలందించేంత వరకూ వేచిఉండవు కదా అంటే.. విద్య, ఆరోగ్య రంగాలలో మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయకపోవటం, ఉన్న నిధుల్ని వీలుని బట్టి నచ్చినట్టు ఖర్చు చేయటం వంటివి మామూలే, ఆ మాత్రం తెలియదా అన్నట్టు ఎగాదిగా చూస్తున్నారని ఓ పాత్రికేయ మిత్రుడు వాపోయాడు. ★

# రూ.1000 కోట్ల ఇసుక కుంభకోణం జీర్ణం, అవినీతికి రాజమార్గం



అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకుపోతున్నట్టు చెబుతున్న ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ అండదండలుంటే దోషులపై చర్యలుండవనే ఫ్యూడల్ పాలన నడుస్తుందనటానికి ఇసుక మాఫియా పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరే తాజా సాక్ష్యంగా నిలుస్తుంది. ఇసుక తవ్వకాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కనుసన్నల్లోనే, మంత్రులు, ఎమ్మెల్యేల ప్రమేయంతోనే కేవలం ఏడాదిన్నర పాలనలో రూ.1000 కోట్లు దోచేసినట్టు స్పష్టమైన ఆరోపణలున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక స్థానికంగానే ఇసుక ధరను నిర్ణయించి డ్వాక్రా మహిళల ద్వారా అమ్మకాలు సాగించాలని ఆదేశించింది. ఆ ప్రకారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇసుక క్యూబిక్ మీటరుకి రూ.500 కాగా, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో రూ.700-750 నిర్ణయించారు. గతంలో ఇసుక రాయల్టీ రూ.40 ఉన్నప్పుడే 2013లో ఇసుకపై రూ.121 కోట్ల మేర రాబడి వచ్చింది. ఇప్పుడు ఇసుక ధరలు పధ్నాలుగు రెట్లు పెరిగాయి. అంటే 12నెలల్లోనే రూ.1700 కోట్ల ఆదాయం సర్కారుకి రావాలి. కానీ 17 నెలల్లో కేవలం రూ.850 కోట్లు వచ్చినట్టు ప్రభుత్వం చెబుతోంది. రూ.1000 కోట్లు ఎవరు తిన్నారో తేల్చండని లోక్‌సత్తా సహా పలు ప్రతిపక్షాలు డిమాండ్ చేసినా, మాఫియాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన కొందరు నిజాయతీ అధికారులపై దాడులు జరిగినా పట్టించుకోని చంద్రబాబు... దోపిడీ జీర్ణం, కోట్లు జీర్ణం అనే రీతిలో అవినీతిపరులకు భరోసానిస్తూ కొత్త ఇసుక విధానాన్ని తీసుకొచ్చారు. ఇందులో దోపిడీ జరిగినా మళ్లీ కొత్త రంగు పులమటమే తప్ప అవినీతిపరులపై చర్యలు మాత్రం ఉండవనటంలో ఏమాత్రం అనుమానం అక్కర్లేదని ఏపీ రాజకీయాలను దగ్గరగా గమనిస్తున్నవారు ఢంకాబజాయించి సూత్రీకరించేస్తున్నారు. ★

# 'షీ' బృందాలున్నా పెరిగిన నేరాలు




మహిళల రక్షణకు తెలంగాణ పోలీసులు చర్యలు తీసుకుంటున్నా, క్షేత్రస్థాయిలో వారిపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్టపడటం లేదు. గతేడాది కొన్ని సాధారణ, తీవ్రమైన నేరాలు తగ్గినా మహిళలపై నేరాలు మాత్రం పెరిగాయి. ముఖ్యంగా అత్యాచారాలు, వరకట్న హత్యలు పెరిగాయి. 2014లో నవంబర్ వరకు రాష్ట్రంలో మొత్తం 93,439 నేరాలు నమోదుకాగా, 2015 నవంబర్ వరకు 92,685 నమోదయ్యాయి. ఇదే సమయంలో మహిళలపై నేరాలు మాత్రం ఆందోళనకరంగా పెరిగాయి. 2014 నవంబర్ వరకు మహిళలపై జరిగిన నేరాలు 11794కాగా, 2015 నవంబర్ వరకు 12,422కి పెరిగాయి. అత్యాచారాలు 893 నుంచి 1020కి, వరకట్న హత్యలు 66 నుంచి 68కి, లైంగిక వేధింపుల కేసులు 2907 నుంచి 3199కి, వేధింపులు 5867 నుంచి 6267కి పెరిగాయి. మహిళల రక్షణకు తెలంగాణ పోలీసు శాఖ అనేక చర్యలు తీసుకున్నా, 'షీ' బృందాలను ఏర్పాటు చేసినా నేరాలు పెరుగుతున్నాయి. సాధారణ దుస్తుల్లో గస్తీ తిరుగుతూ మహిళల్ని వేధించేవారిని షీ బృందాలు పట్టుకుంటున్నాయి. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు కోసం వచ్చే మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లను కూడా చేశారు. ఈ నేపథ్యంలో, మహిళల భద్రతకు మరింత సమగ్ర ఏర్పాట్లు అవసరమని అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. షి బృందాలు, బస్సుల్లో ఇనప తెరలు వంటి పాతకాలపు ఆలోచనలతో మహిళలపై నేరాల్ని అడ్డుకోలేరని, స్థానిక న్యాయాలయాల ఏర్పాటు, వికేంద్రీకరణ, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర కనీస సంస్కరణల్ని చేపట్టాలని లోక్‌సత్తా సూచించినా వాటిపై ప్రభుత్వం మాత్రం పెదవివిప్పటం లేదు. ★

# బాబాసాహెబ్ అని ఏ నాయకుడ్ని పిలుస్తారో కూడా తెలీదట!




మోస్ట్ పాపులర్ షోలలో ఒకటిగా దశలవారీగా నడుస్తున్న 'మీలో ఎవరు కోటీశ్వరుడు' (ఎంఈకే) లో పాల్గొనాలని ఉవ్విళ్లూరుతున్న యువత సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఉద్యోగాన్వేషణలో ఉన్న సామాన్యులకు 'మా' టీవీ ఎంఈకే ఎంట్రీ కోసం కసరత్తు ఓ నిరంతర కార్యక్రమం. వగలు, రాత్రి తేడా లేకుండా, సివిల్స్‌కి, గ్రూప్స్‌కి ప్రిపేరైనట్టు ఇందుకోసం ప్రయత్నిస్తున్నారు. జనరల్ నాలెడ్జి ప్రశ్నలను బట్టీ పడుతున్నారు. అడ్డదారుల్లో సంపాదన సరికాదనే విమర్శలను కొట్టిపారేస్తూ, ఇందులో గెలవాలంటే కొంత టాలెంట్ కూడా అవసరం కాబట్టి షో కోసం ప్రయత్నించటంలో తప్పేముంది అంటున్నారు బాగా చదువుకున్నవారు, ఆదాయవనరు ఉన్నవారు కూడా.



ఇక షోలోకి వస్తే, చాలామంది పరిజ్ఞానం నిరుత్సాహపరిచేలా ఉంది. తెలుగు భాషలోని సాధారణ సామెతలు తెలియనివారు కూడా ఇంత పెద్దసంఖ్యలో ఉన్నారన్న ఆశ్చర్యం, ఆవేదన కలుగుతున్నాయి. అన్నిటికంటే, బాగా షాక్‌కి గురిచేసిన విషయం ఈ మధ్య ఓ షోలో చోటుచేసుకుంది. హాట్‌సీట్‌లో ఓ యువ ఇంజినీరింగ్ విద్యార్థిని కూర్చున్నారు. ఆ అమ్మాయి లక్ష్యం అమెరికాలో ఎంఎస్ చేయటం. అందుకోసం డబ్బు కావాలని ఎంఈకేని ట్రై చేస్తున్నట్టు చెప్పారామె. ఆమె తల్లిదండ్రులు ఉపాధ్యాయరంగంలో ఉన్నారు. వారు కూడా షోకి వచ్చారు. కొన్ని ప్రశ్నల తర్వాత షో ప్రజెంటర్, సినీ హీరో నాగార్జున ఒక చిన్న ప్రశ్న అడిగారు– బాబాసాహెబ్ అని ఏ జాతీయ నాయకుడిని పిలుస్తారు?. ఈ ప్రశ్నకు ఆప్షన్స్‌గా బాబూ రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, డా॥ బీఆర్ అంబేద్కర్ పేర్లను ఇచ్చారు. ఆ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌కి ఆ ప్రశ్నకు సమాధానం తెలియదట. అంబేద్కరయితే కాదు, బోస్‌ని అలా పిలవరు...ఇలా తనలో తాను పెద్దగా అనుకున్నారు. ఇక టైమ్ గడిచిపోతుండటంతో, ఫ్లిప్‌కార్ట్ లైఫ్‌లైన్ తీసుకున్నారామె. అందులో భాగంగా ఆడియన్స్ పోల్‌ని యాక్టివేట్ చేయమన్నారు. సాధారణంగా ఆడియన్స్‌లో రకరకాల వారు, ఎక్కువగా చదువుకున్నవారు ఉంటారు కాబట్టి, గురితప్పదు. 90శాతం కరెక్టవుతూంటుంది. అయితే బాబాసాహెబ్ ప్రశ్నలో ఆడియన్స్ పోల్ కూడా తప్పింది. అలా ఎవరిని పిలుస్తారో ఆడియన్స్‌కి కూడా తెలియదట. భారత రాజ్యాంగ రచనలో, ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన బాబాసాహెబ్ అంబేద్కర్ గురించే తెలియకపోతే ఇక మన విద్యావ్యవస్థ ఎలా ఉంది? మన సామాజిక వ్యవస్థ భవిష్యత్తు ఏమిటి? కొన్ని వర్గాలు అంబేద్కర్‌ని తమకే పరిమితం చేయాలనుకుంటుంటే, మరికొన్ని వర్గాలు ఆయన గురించే తెలుసుకోవాలనుకోవటం లేదు. ఇలాంటి సమాజం, విద్యావ్యవస్థ, రాజకీయం వల్ల నష్టపోయేది మన భవిష్యత్తే అని గుర్తించటానికి ఇంకా ఎంత సమయం తీసుకుంటాం? ★

# 'వినూత్న ఆలోచనలు' అంటే ఇలాంటివేనా?

- ఆకార్ పటేల్




భారతీయ పౌరులు మరింత మెరుగైన సేవలు అందుకుని, దేశం పురోగతి సాధించటానికి తోడ్పడుతూ.. కొత్త పుంతలు తొక్కే వినూత్నమైన ఆలోచనలపై కృషి చేయాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ తన అత్యున్నత అధికారులను ఆదేశించారు. దీనిపై వారు కొన్ని వారాలపాటు నిశితంగా ఆలోచించి ఒక నివేదికను ప్రధానికి సమర్పించాల్సి ఉంది.

వినూత్న ఆలోచనలు అంటే పూర్తిగా తాజా ఆలోచనలు అని అర్థమైనట్టయితే అధికారులకు అవి రావటం కష్టమేనని నా అభిప్రాయం. మనకు తెలిసి ఆధునిక ప్రజాస్వామ్యం వయస్సు 250 ఏళ్లు (దాని కీలక భావనలు క్రీస్తుకు ముందు 5వ శతాబ్ది నాటి ఏథెన్స్‌కి సంబంధించినవి). ఆధునిక పౌర ప్రభుత్వం వయస్సు 500 ఏళ్లు అయివుండవచ్చు. అంటే పూర్తిగా వినూత్న విషయం ఆవిష్కృతమయ్యేందుకు ఇంకా వేచి ఉండాల్సిరావటం అసంభావ్యం కావచ్చు.

కానీ సృజనాత్మక ఆలోచనలకు నేటికీ అవకాశం ఉందనటం వాస్తవమే. అలాంటి ఒక ఆలోచనను ప్రధాని గతంలో గుజరాత్‌లో ప్రవేశపెట్టారు. గ్రామీణ గృహాలకు, గ్రామీణ పంట పొలాలకు విద్యుత్తు సరఫరాను ఆయన పూర్తిగా విభజించివేశారు. దీంతో ఇళ్లకు నిరంతరాయ విద్యుత్తు లభిస్తుంటుంది. వ్యవసాయ మోటార్లు రోజులో కొన్ని గంటలపాటు విద్యుత్తు పొందుతుంటాయి. విద్యుత్తు తీగల నష్టాలు (చౌర్యం అని అర్థం), విద్యుత్తు ఎప్పుడూ తక్కువగానే వస్తున్నందున ఛార్జీలు ఎందుకు చెల్లించాలంటూ వినియోగదారులు తిరస్కరించటం వంటి ప్రత్యేక సమస్యలు తలెత్తే ప్రపంచంలో ఈ సాధారణ ఆవిష్కరణ కూడా చాలా పెద్ద వ్యత్యాసం కలిగివుంటుంది. వినూత్న ఆలోచనలపై ప్రధాని ఆదేశాల గురించి టీఎన్ నీనన్.. బిజినెస్ స్టాండర్డ్‌లో రాస్తూ, అధికారులు తాజా ఆలోచనలతో రావటం అంత సులభంకాదని చెప్పారు.

'బ్యూరోక్రాట్లు నియమనిబంధనలను తూచ తప్పకుండా అమలుపరచటంలో శిక్షణ పొంది ఉంటారు తప్ప వీరు సమస్యల పరిష్కారకర్తలు కారు. అందుకే నూతన ఆలోచనలు సాధారణంగా రాజకీయ నాయకులు, టెక్నోక్రాట్లు, పౌరసమాజ కార్యకర్తల నుంచే వస్తుంటాయి' అని నీనన్ రాశారు. సబ్సిడీ బియ్యం పథకం, మధ్యాహ్న భోజన పథకం, సమాచార హక్కు వంటివి వెలుపలి నుంచి వచ్చిన ఆలోచనలుగా తను పేర్కొన్నారు. అందుకే పెద్ద విషయాలన్నీ శాసనరూపంలోనే అమల్లోకి వచ్చాయని నా అభిప్రాయం. ఏకీకృత పన్ను వ్యవస్థ లేదా మరింత సమర్థవంతమైన భూ సేకరణ చట్టం అనేవి భారత ఆర్థిక పనితీరుని నాటకీయంగానే మెరుగుపరుస్తాయని ఎవరైనా వాదించవచ్చు కానీ దీన్ని నేను అంగీకరించను. ఇవి నాటకీయ మార్పు కంటే, సమర్థతను ముందుపీటకి తీసుకువచ్చే చిన్న అంశాలు మాత్రమే. భారత్‌లో పనిచేయకుండా ఉన్న ప్రధానమైన విషయం ఒక్కటి మాత్రమే. అది సుపరిపాలన

అంటూ మోదీ చెబుతున్నటువంటి, అమలుకు సంబంధించినటువంటి పరిమితమైన విషయం కాదు. నేను ఇంతకు ముందు రాసిన దాన్నే మళ్లీ చెప్పాల్సి ఉంటుంది. వ్యక్తిగత ప్రవర్తన, నైతిక వర్తనలో మార్పు తీసుకురావటం అనేది ప్రభుత్వ వ్యవహారపరిధికి సంబంధించిన వ్యవహారం కాదు. ఉదాహరణకు స్వచ్ఛ భారత్ అభియాన్‌నే తీసుకుందాం. మోదీ స్వయంగా వీధుల్లో ఊడుస్తూ ప్రమోట్ చేసిన పథకం ఇది. భారతీయులు మరింత పరిశుభ్రంగా ఉండాలనటం గొప్ప విషయమేకానీ ఇది ప్రభుత్వం చేయాల్సిన పనా? నేనయితే అలా భావించటం లేదు.

ఇది సామాజిక సంస్కరణ. దీన్ని ప్రభుత్వ అధికారులు, మంత్రులు కాకుండా, సమాజంలోపలే మతవిభాగాలు వంటి సంస్థలు చేయవలసి ఉంది. అందుకే మోదీ వాస్తవంగా ఆశిస్తున్న ప్రధాన మార్పు దాన్ని అమలుపరచగలిగేటువంటి ఆయన అధికారం వల్ల రాదు. భారత్‌పై అధ్యయనం చేసి ఇద్దరు ఎంఐటీ ప్రొఫెసర్లు రాసిన 'పూర్ ఎకనామిక్స్' (పేదరిక అర్థశాస్త్రం) అనే పుస్తకం మోదీ చదవాల్సిన పుస్తకాలలో ఒకటి అని నీనన్ రాశారు.

పోతే, ఇద్దరు విద్యావేత్తలు (ఈషర్ డుఫ్లో, అభిజిత్ బెనర్జీ) తమ పరీక్షల్లో భాగంగా, అయిదు ప్రధాన వ్యాధులకు సంబంధించిన ప్రామాణిక రోగలక్షణాలున్నట్టు చెప్పుకునే కొందరు నటులను ప్రభుత్వ వైద్యుల వద్దకు పంపించారు. దిగ్భ్రాంతి కలిగించే విషయమేమంటే, ఆ రోగుల వ్యాధిని నూటికి 97శాతం వరకు వైద్యులు సరిగా నిర్ధారించలేకపోయారు. ఎందుకంటే రోగుల పట్ల వీరికేమాత్రం పట్టింపు లేదు. సగటున ఒక్కో రోగిని 60 సెకండ్ల కంటే ఎక్కువ సేపు వీరు పరీక్షించలేదు. కేవలం మూడు శాతం సందర్భాలలో మాత్రమే వైద్యులు తమ వ్యాధులను నిర్ధారించే పరిస్థితుల్లో, మీరు ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స చేయించుకోవటానికి బదులు ఇంటిపట్టునే ఉండటం మేలు.

భారత్‌లో పనిచేసిన హార్వర్డ్ విద్యావేత్త లాంట్ ప్రిచెట్ కూడా భారత ప్రభుత్వంతో ముడిపడిన సమస్యలకు సంబంధించి మరో రెండు ఉదాహరణలను చూపారు. మొదటి ఉదాహరణ: ఢిల్లీలోని రోడ్డు రవాణా ఆఫీసు (ఆర్టీవో)లో డ్రైవింగ్ లైసెన్సు కోసం వచ్చిన ఒక బ్యాచ్ అభ్యర్థులను ఈయన పరిశీలించి కనుగొన్న విషయమేమంటే, లంచం ఇవ్వకపోతే మీరు ఖచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు పరీక్షలో ఫెయిలవుతారని. మీరు లంచం ఇస్తే, డ్రైవింగ్ పరీక్షకు హాజరుకానప్పటికీ మీకు లైసెన్సు లభిస్తుంది. దీని అర్థం ఏమిటి? మీరు చట్టప్రకారం నడుచుకుంటే మీరు శిక్షకు పాత్రులవుతారు. అదే మీరు లంచం ఇస్తే, వాహనాన్ని డ్రైవ్ చేయవలసిన అవసరం కూడా ఉండదు. ఈ తరహా లంచగొండితనం ఎంత వ్యవస్థీకృతంగా తయారైందంటే, ఆర్టీవో సిబ్బందికి నేరుగా ముడుపులు ముట్టవు. ఇది ఎంత సమర్థవంతంగా అమలవుతుందంటే, ప్రతిభావంతులైన డ్రైవర్లను మినహాయిస్తే, రోడ్డు రవాణా కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరూ లైసెన్సు కోసం ముడుపులు చెల్లించాల్సిందే.

ప్రిచెట్ పేర్కొన్న మరొక ఉదాహరణ ప్రకారం, రాజస్థాన్‌లోని నర్సులు పనిచేయరని పరిశోధనలో తేలింది. వీరిలో సగం మంది ఇంటి వద్ద ఉంటూనే లేక మరొక పని చేస్తూనో తమ జీతాలను మాత్రం క్రమం తప్పకుండా అందుకుంటున్నారని కనుగొన్నారు. నర్సులు హాజరును పర్యవేక్షించే వ్యవస్థను అమలుచేయటం ద్వారా మార్పు తీసుకురావాలని ఒక ఎన్జీవో సదుద్దేశంతో ప్రయత్నించిందికానీ విఫలమైంది. అప్పుడు కూడా నర్సులు తమ పనికి దూరంగా ఉండటాన్ని కొనసాగించారు. కానీ వారి గైర్హాజరీని తనిఖీ చేసిన ప్రతిసారీ తాము రాకపోవటానికి అధికారికంగానే వారు సంజాయిషీ చెప్పుకున్నారు.

భారత్‌లోని వ్యవహారాలతో పరిచయమున్నవారికి ఇవేవీ దిగ్భ్రాంతి కలిగించవు. ఇక్కడ ప్రభుత్వ వ్యవస్థ కుప్పకూలిపోయింది లేదా తన క్రియాత్మకతను కోల్పోయింది. మీరు పోలీసు స్టేషన్‌ని లేదా ఫుట్‌పాత్ అంచుని పరిశీలించినా ఇది నిజమేనని తెలుతుంది. అయితే ఒకవైపు న్యూఢిల్లీ నిజమైన పరిష్కారాలను ప్రతిపాదించనున్నప్పుడు మనం దీన్ని ప్రభుత్వ సమస్యగా చూడవచ్చా? లేదా సమాజ సమస్యగా చూడవచ్చా? నేనయితే రెండోదానికే మద్దతిస్తాను. అందుకే ప్రభుత్వం, బ్యూరోక్రాట్లు సదుద్దేశంతో దీన్ని మార్చాలనుకున్నా సాధ్యం కాదు.

('సాక్షి' సౌజన్యంతో)

# ఆకార్ పటేల్ వ్యాసంపై లోక్‌సత్తా టైమ్స్ స్పందన

పై వ్యాసంలో ఆకార్ పటేల్ ప్రశంసనీయంగా లేవనెత్తిన అంశాలను, విశ్లేషణ తీరును లోక్‌సత్తా పూర్తిగా అంగీకరిస్తుంది. ఎందుకంటే, రెండు దశాబ్దాలుగా ఇవే అంశాలను లేవనెత్తుతూ, ప్రజలలో, ప్రభుత్వంలో చైతన్యం తెస్తూ వీలైనన్ని సాధిస్తోంది

కాబట్టి. మనదేశం గురించి ఇలాంటి విశ్లేషణలు కావాలంటే, మైరన్ వీనర్, రాబర్ట్ వేడ్ వంటి విదేశీ మేధావుల మీద ఆధారపడిన తరుణంలో.. సుమారు రెండు దశాబ్దాల క్రితం లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ మనదేశంలోని అన్ని మౌలిక రంగాల గురించి సమగ్ర విశ్లేషణ, ప్రామాణిక పరిష్కారాలను ప్రపంచ అనుభవాలు, దేశీయ పరిస్థితుల సమన్వయంతో 'భవిష్యత్ భారతం' పేరుతో సుమారు పదేళ్ల పాటు (1997-2006) వ్యాసాల రూపంలో అందించారు. కొంత డేటా మారినా, జేపీ భవిష్యత్ భారతంలో పేర్కొన్న సంస్కరణలు ఇంకా వర్తమానంగా మారలేదని రాజ్యసభ సంస్కరణలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ తాజాగా రుజువు చేస్తోంది. ఇలా మౌలికాంశాల చుట్టూ ప్రామాణిక సాక్ష్యాధారాలతో లోతైన విశ్లేషణలు ఎంత ఎక్కువ వస్తే అంత మంచిదని లోక్‌సత్తా భావిస్తుంది.

ఇక ఆకార్ పటేల్ ప్రస్తుత వ్యాసానికొస్తే, గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ ప్రవేశపెట్టిన ఒక వినూత్న ఆలోచనగా గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లకు, వ్యవసాయానికి విద్యుత్తు ఫీడర్లను వేరు చేసి ఇళ్లకు 24 గంటలూ విద్యుత్తునిచ్చే పథకం గురించి చెప్పారు. నిజానికి ఆ ఆలోచన లోక్‌సత్తాదే. మోదీ కంటే ముందు విద్యుత్తు సంస్కరణల్లో భాగంగా ఆ అంశాన్ని లోక్‌సత్తా ప్రతిపాదించింది. జేపీ భవిష్యత్ భారతం వ్యాసాల్లో కూడా ఈ ప్రతిపాదనలున్నాయి. అలాగే, విద్యుత్తు సరఫరాలో నష్టాన్ని తగ్గించటం కోసం వికేంద్రీకరణ ఏర్పాటును పశ్చిమ గోదావరి జిల్లా కళ్లచెర్వులో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసి లోక్‌సత్తా మంచి ఫలితాల్ని సాధించింది. సరఫరా నష్టాన్ని 18శాతం మేర తగ్గించి చూపింది. అప్పట్లో బీజేపీ నేత అరుణ్ జైట్లీ లోక్‌సత్తా కృషిని ప్రత్యేకించి ప్రస్తావించి అభినందించారు. ఆ తర్వాత మోదీ ముఖ్యమంత్రిత్వంలో గుజరాత్‌లో అమలు చేసి మంచి ఫలితాలను సాధించగా, మన తెలుగు నాట మాత్రం ఇప్పటికీ అమలు చేయలేక, విద్యుత్తు వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టారు. ఇక ఆకార్ పటేల్ నిరాశావాదాన్ని మాత్రం లోక్‌సత్తా అంగీకరించదు. ఎందుకంటే, ఇప్పటికే ఆయన లేవనెత్తిన అంశాలకు లోక్‌సత్తా నిర్దిష్ట పరిష్కారాలను చెబుతోంది. ఉదాహరణకి, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధులను బదిలీ చేసి మూడో అంచె ఫెడరలిజాన్ని బదిలీ చేయటం. ఇది పెద్ద గేమ్ ఛేంజర్. మంచిని ప్రోత్సహించి, చెడును నిరుత్సాహపరిచే బాధ్యతను వ్యవస్థీకృతంగా ప్రభుత్వం చేయలేదు అంటే ఇక ఎన్నికలు, ప్రజాస్వామ్యం రాజ్యాంగం ఎందుకు? ఇంత చర్చ ఎందుకు? యథాస్థితిని కొనసాగించే నేతలకు, జనాభాలో కేవలం నాలుగైదు శాతం ఉన్న ప్రభుత్వోద్యోగులకు లక్షల కోట్ల జీతాలు, అంత జీవన భద్రత ఎందుకు? ప్రజలు కోరుకునే అభివృద్ధి, మంచి భవిష్యత్తుకు మెరుగైన మార్గాల్ని తెలియచెప్తూ, వారిని ఒప్పిస్తూ, వారు మార్పుకు దోహదం చేయగలిగే వ్యవస్థలను నిర్మించకుండా.. ప్రజల్లో మార్పు వచ్చేంతవరకూ మేం ఏమీ చేయలేం, దేశం దానంతటే అభివృద్ధి చెందాలి అంటే ఇక వాళ్లు చేసేదేముంది? రోబో లీడర్లు, ఉద్యోగులు బెటర్ కదా!

అలాగే ఒక్క ఎంపీ లేకపోయినా లోక్‌సత్తా పార్టీల విరాళాలలో పారదర్శకత పెంచే చట్టం, అభ్యర్థుల నేరచరిత్ర వివరాల ప్రకటన, ఓటరు జాబితాల ప్రక్షాళన, సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి 97వ రాజ్యాంగ సవరణ, సమాచార హక్కు చట్టం, జాతీయ ఆరోగ్య మిషన్, స్థానిక న్యాయాలయాల చట్టం, మంత్రివర్గ సభ్యుల సంఖ్య కుదింపు ఏర్పాటు, 2జీ కేసు నేపథ్యంలో ప్రకృతి వనరుల కేటాయింపులో బహిరంగ వేలం, న్యాయనియామకాలకు జాతీయ కమిషన్ వంటి చట్టాలను లోక్‌సత్తా సాధించింది. లోక్‌సత్తా ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణల్ని గుజరాత్‌లో అమలు చేయగలిగిన ప్రధాని మోదీ, అలాంటి ఆలోచనల్ని ఇప్పుడు పౌరసమాజమో, మరోటోమరోటో నుంచి తీసుకుని దేశప్రయోజనాల కోసం ఎందుకు అమలు చేయలేకపోతున్నారు? నిరాశతో వ్యాసాన్ని ముగించకుండా ఈ ప్రశ్నను ఆకార్ పటేల్ లేవనెత్తి చర్చించి ఉంటే మెరుగైన పరిష్కారం కనిపించేది.

వనరులు, సమర్థత ఉన్నవాళ్లు రాజకీయాలను పట్టించుకోకపోవటం, సంక్లిష్ట భిన్నత్వం మనదేశంలో పెద్ద సమస్యలే అయినప్పటికీ వాటిని సరిచేసే విధంగా ప్రభుత్వం తగిన వాతావరణాన్ని.. స్థానిక సాధికారత, సర్వీస్ గ్యారంటీ చట్టం, ఎన్నికల సంస్కరణలు వంటి వాటితో నిర్మించే ప్రయత్నం చేస్తే ఖచ్చితంగా మార్పు వేగవంతమవుతుంది. వ్యక్తిసుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానించే వ్యవస్థ నిర్మాణం ఈదేశంలో పూర్తిగా ఆచరణసాధ్యం. కాకపోతే, సర్వరోగ నివారిణి, చిట్కాల కోసం ఇంకా వెతకకుండా ఆటనియమాలను మార్చే బహుముఖ సంస్కరణల కోసం కృషి చేయాలి. ★

# మోదీజీ! సహ చట్ట కార్యకర్తలా కాకుండా ప్రధానిలా అందరికీ ఆరోగ్య విధానం, అమలు గురించి చెప్పండి

ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ బెంగళూరు వద్ద యోగ పరిశోధన, అనువర్తనంపై ఓ అంతర్జాతీయ సమావేశాన్ని ప్రారంభిస్తూ, వైద్య ఖర్చులను తగ్గించుకోవటం ఎలాగో చెప్పారు. ఆ సందర్భంగా భారతదేశంలో వైద్యసంక్షోభంపై గణాంకసహితంగా వివరించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో అంటువ్యాధులు కాని జబ్బులతో మృతి చెందినవారి సంఖ్య 1990 నుంచి 2008 నాటికి నలభై నుంచి ఎనభైశాతానికి పెరిగిందని ప్రధాని తెలిపారు. అంటువ్యాధులు కాని జబ్బులతో మరణించేవారి సంఖ్య 2030కల్లా ధనిక దేశాల్లో కంటే పేదదేశాల్లో ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనాలను వివరించారు. హృద్రోగాలు, క్యాన్సర్, శ్వాసకోశ జబ్బులు, మధుమేహం లాంటి అంటువ్యాధులు కాని రుగ్మతల వల్లే అరవైశాతం మరణాలు దేశంలో సంభవిస్తున్నాయన్నారు. ఈ వ్యాధులతో బాధపడేవారిలో 40శాతం మందే ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, 35శాతం మంది బైటిరోగులుగా వైద్యాన్ని పొందుతున్నారన్నారు. ఇలాంటి మరణాలు కేవలం కుటుంబాలకే కాకుండా దేశ ఆర్థికవ్యవస్థకూ నష్టదాయకమన్నారు. ఆరోగ్యరంగంపై మోయలేనంత భారం పడుతోందన్నారు. ఆధునిక చికిత్స విధానాలకూ పరిమితులున్నాయని, వీటి ఖర్చు పెరిగిపోతుండటంతో, పశ్చిమ దేశాలు కూడా సంప్రదాయ వైద్యవిధానాలైన ఆయుర్వేదం, ప్రకృతి వైద్యం, యునాని వంటి వాటివైపు చూస్తున్నాయని, వీటిని యోగాతో అనుసంధానించే ప్రయత్నం చేస్తున్నాయని ప్రధాని చెప్పారు.

అయ్యా, ప్రధానిగారూ! కేవలం ఇది చెప్పటానికైతే మీలా ప్రభుత్వంలో ఉన్నవారు అక్కర్లా. పౌరసమాజంలోనో, ప్రతిపక్షంలోనో ఉన్న సమాచార హక్కు చట్టం కార్యకర్త చాలు.

అందరికీ ఆరోగ్యం ఇవ్వటానికి మీరు ఎన్నికలలో చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? స్థూల జాతీయోత్పత్తిలో కనీసం 2శాతం కూడా కేటాయించటంలేదని గత యూపీయే ప్రభుత్వాన్ని తూర్పారపట్టిన మీరు, ఇప్పుడు కనీసం 1శాతం కూడా కేటాయించటం లేదు. ఆరోగ్యంపై భారం ప్రభుత్వం మీద




పడటం లేదు, ప్రజలు మోస్తున్నారు. మోస్తూమోస్తూ అప్పుల భారంతో పేదరికంలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నిటినీ నిర్వీర్యం చేసే రీతిలో ఆరోగ్య సమస్యలు ప్రజలను పీడిస్తున్నాయి. మీరు చెబుతున్న సంపన్న దేశాలు, ముందు ప్రజలకు సరైన విద్య, ఆరోగ్యం అందించాక ఆ తర్వాత ఖర్చులు తగ్గించటం ఇతరత్రా సంస్కరణల గురించి ఈరోజు మాట్లాడుతున్నాయి. అసలు ఆరోగ్యరంగాన్ని గాలికొదిలేసి యోగా, ఆయుర్వేదం వంటి మార్గాల్లో ఖర్చు తగ్గించుకోండని చెప్పటం ఏరకంగానూ తగిన విధానం కాదు. ఎమ్మెల్యేలకో, ఎంపీలకో, మంత్రులకో, ప్రధానికో ఆరోగ్య రక్షణ ఇలాగే కల్పించమని చెప్పగలరా? తమరు సమాచార హక్కు చట్ట కార్యకర్తలా కాకుండా ప్రధాని స్థాయిలో విధానాల గురించి, అమలు గురించి, ఫలితాలను సమీక్షించి ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయటం, పరిశోధనలు గురించి మాట్లాడాలి.

అనేక అంటు రోగాలకు కారణమవుతున్న అపరిశుభ్రత, తాగునీటి కాలుష్యం వంటి వాటిని సరిచేయటానికి కావలసిన స్థానిక ప్రభుత్వాల సాధికారత గురించి కూడా ప్రధాని దాటవేశారు. నిజానికి స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలను స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు ఇచ్చి అప్పచెప్పి ఉంటే విజయవంతమై ఉండేవి. ప్రజారోగ్య నిర్వహణలో బలమైన స్థానిక ప్రభుత్వాలు కీలకపాత్ర పోషించే అవకాశమున్నా, మోదీ ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులను పెంచింది తప్ప వాటిని పట్టించుకోలేదు. కీలకమైన మూడో అంచె ఫెడరలిజం బలపడకుండా పటిష్ట ఆరోగ్య సేవలు అందించటం కష్టమవుతుంది.

కాబట్టి ప్రధానిగారూ, అందరికీ ఆరోగ్యం అందించటం ప్రభుత్వ బాధ్యత అని ముందు మీరు స్పష్టంగా ప్రకటించాలి. దీనికి దేశాన్నేమీ తాకట్టుపెట్టనక్కర్లా. మనదేశంలో అందరికీ ఆరోగ్యాన్నిచ్చే ఇటువంటి పటిష్టమైన వైద్యారోగ్య వ్యవస్థ జీడీపీలో కేవలం 2శాతంతోనే సాధ్యమని ఉజ్జాయింపు లెక్కలు చెబుతున్నాయి. వీటిని ప్రధాని, ఆ మాటకొస్తే, ఉచిత వైద్యపరీక్షలు వంటి పథకాలతో ప్రైవేటు వ్యాపారసంస్థలకంటే కనాకష్టంగా ప్రజారోగ్య బాధ్యతల నుంచి తప్పించుకుంటున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా పరిశీలించి అందరికీ ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలి.

మనదేశంలో ప్రైవేటు ఆరోగ్య వ్యయంలో 90శాతం ప్రజలు జేబుల్లో నుంచి, అప్పులు చేసి చెల్లిస్తున్నదే. అనారోగ్యం, వైద్యఖర్చుల వల్ల చాలామంది పేదరికంలోకి జారిపోతున్నారు. పేదరిక నిర్మూలనకు అధ్వాన్న వైద్యారోగ్య వ్యవస్థ కూడా ముఖ్య అవరోధంగా మారింది.

ప్రజారోగ్యం మీద చేసే కొద్దిపాటి ఖర్చును కూడా ఉపయోగపడేరీతిలో కాకుండా అర్థంలేకుండా చేస్తున్నారు. వ్యాధి బాగా ముదిరి తక్కువ ఫలితాలు వచ్చే దశలో ఆసుపత్రుల్లో, ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యానికి ప్రజాధనాన్ని పందేరం చేస్తున్నారు. కుటుంబ ఆరోగ్యాన్ని దాదాపు విస్మరించారు. దేశంలోని చాలా చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పట్ల ప్రజల్లో నమ్మకం లేదు. ఔట్ పేషెంట్లలో 80శాతం, ఇన్ పేషెంట్లలో 60శాతానికి పైగా ప్రైవేటు రంగాన్ని ఆశ్రయిస్తున్నారు. పేదప్రజలు తమ తాహతుకు మించి కన్సల్టేషన్, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందుల కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. వైద్య ఖర్చుల కోసం పేదలు ఆస్తుల్ని అమ్ముకోవటం, భారీ వడ్డీకి అప్పులు తెచ్చుకోవటం (కొన్ని సందర్భాలలో నెలకు 10శాతానికి పైగా) తప్పని పరిస్థితి ఏర్పడింది. అలా ఆసుపత్రిపాలైన వారిలో నాలుగోవంతుమంది వైద్యఖర్చుల వల్ల మరింత పేదలుగా, నిరుపేదలుగా మారిపోతున్నారు.

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ కృషితో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం) వంటి వాటి వల్ల చిన్న మార్పు మొదలైంది కానీ మొత్తం మీద వైద్యారోగ్య రంగం ఇంకా ప్రమాదకర పరిస్థితిలోనే ఉంది. ఇన్సూరెన్స్ ప్రాతిపదికన ప్రైవేటు ఆసుపత్రుల భాగస్వామ్యంతో, ఫీ-ఫర్-సర్వీస్ వంటి జనాకర్షక కార్యక్రమాలను ప్రభుత్వం ఇటీవల ప్రారంభించింది, అయితే వాటి వల్ల ఖర్చు కనిపించిందితప్ప వైద్య వ్యవస్థ పరిస్థితిలో మార్పు రాలేదు. తృతీయదశలో జబ్బుకు చికిత్సను ప్రైవేటు ఆసుపత్రులకు ఔట్‌సోర్సింగ్ ఇచ్చి ప్రభుత్వం డబ్బు చెల్లించటం వల్ల అవసరానికి మించి ఎడాపెడా ట్రీట్‌మెంట్ ఇవ్వటం, అక్రమాలు, ఇన్సూరర్, ప్రొవైడర్ లాలూచీ పడి తప్పుడు క్లెయిమ్‌లతో ప్రజాధనాన్ని కొట్టేయటం వంటివి జాడ్యాలుగా మారాయి. ఎప్పటికప్పుడు వ్యయం పెరుగుతున్నా, పటిష్టమైన, పనికొచ్చే కుటుంబ ఆరోగ్య వ్యవస్థ లేకపోవటం వల్ల చాలా కేసుల్లో పేదలు జేబుల్లో నుంచి డబ్బు ఖర్చు చేసుకుని వైద్యఖర్చుల భారాన్ని మోయవలసి వస్తోంది.

అందుబాటు ఖర్చులతో అందరికీ అర్థవంతమైనరీతిలో ఆరోగ్యం అందించేందుకు ప్రభుత్వాలు ముందు మనకున్న అనేక సానుకూల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. మనకు తగినంతమంది వైద్యారోగ్య సిబ్బంది ఉన్నారు. అవసరమైతే, మరింతమందికి శిక్షణనివ్వొచ్చు (శిక్షణలో నాణ్యతాప్రమాణాలు కొన్నిసార్లు సంతృప్తికరంగా లేనప్పటికీ, ఈ లోపాన్ని సరిచేయవచ్చు). గుండె శస్త్రచికిత్స, మూత్రపిండాల మార్పిడి, కీళ్ల మార్పిడి వంటి చాలా సంక్లిష్టమైన వైద్యసేవలను ప్రపంచంలోని మిగతాదేశాల కంటే చాలా తక్కువ ఖర్చుతో విజయవంతంగా అందిస్తున్న అద్భుతమైన ఘనత మన వైద్యులకు ఉంది. నాణ్యమైన వైద్యసేవల్ని తక్కువ ఖర్చుతో పొందేందుకు సంపన్న దేశాలకు చెందిన రోగులు పెద్దసంఖ్యలో భారత్‌కు వస్తున్నారు. నాణ్యతలో, ఖరీదులో మన మందుల పరిశ్రమ ప్రపంచస్థాయిలో ఉంది. ఎయిడ్స్ మందుల మార్కెట్‌లోకి భారత్ ప్రవేశించటం వల్లే భారీగా తగ్గి ఆ మందులు చాలా పేదదేశాలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ బలాలన్నిటినీ మనం చకచకా వినియోగించుకోగలం. ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతోపాటు అనేక సాంకేతిక, రెగ్యులేటరీ, నిర్వహణ పరమైన ఏర్పాట్లు, జవాబుదారీతనం కోసం పర్యవేక్షణలు, సంస్థలు ఏర్పాటు చేసుకుంటే.. ప్రతి ఒక్కరికీ తక్కువ ఖర్చుతో వైద్యసేవల వ్యవస్థను నిర్మించగలం, మన ప్రజారోగ్య వ్యవస్థను విప్లవాత్మకంగా మార్చగలం. ★

# చౌక.. పర్యావరణహితం
# స్వచ్ఛ భారత్ సక్సెస్‌కి సరికొత్త టాయిలెట్లు

పర్యావరణం కొంతమంది కాలక్షేపానికి పరిమితమైన అంశం కాదని, అందులో కీలక ఆర్థిక, రాజకీయాంశాలు ఉన్నాయని ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకు అర్థమవుతోంది. రికార్డులను బద్దలు కొడుతున్న ఎండలు, వానలు, వ్యాధులు, దెబ్బతింటున్న పంటలు ఏటా పెరిగిపోతున్నాయి. పనికిమాలిన చర్చలు కొనసాగుతున్నాయి... పరిరక్షణపై ఒక్కసారిగా దృష్టి పెరిగింది. పారిస్ సదస్సు, చెన్నై, ఢిల్లీ నగరాల అనుభవాలతో మనదేశంలో కూడా పర్యావరణంపై చర్చ విస్తరిస్తోంది. పరిష్కారాల కోసం అడుగుతున్న వారు పెరుగుతున్నారు.




మనదేశం విషయానికొస్తే, కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించటానికి ఇప్పటిదాకా పాలకులు చేసిన ప్రయత్నాల కంటే స్వచ్ఛంద సంస్థలే ఎక్కువగా చేశాయని చెప్పొచ్చు. కాలుష్యరహిత వాతావరణాన్ని సాధించేందుకు దేశవ్యాప్తంగా మంచి పరిశుభ్రతను పెంచాలని భారత ప్రభుత్వం గతంలో 'నిర్మల్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే అది మొక్కుబడిగానే సాగటంతో విఫలమైంది. అలాగే ఇప్పుడు స్వచ్ఛభారత్‌ని ప్రారంభించింది. పరిశుభ్రత పట్ల గట్టి సంకల్పం ఈసారి కనిపిస్తున్నా, విధానాల రూపకల్పన సరిగా లేకపోవటంతో అది కూడా ఒక ప్రచారతంతులాగే సాగుతోంది. పరిశుభ్రతకున్న అర్థం ఎంతో విస్తృతమైనదైనా, నిర్మల అభియాన్, స్వచ్ఛ భారత్ రెంటిలోనూ తొలి ప్రధాన అడుగుగా మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇది చాలా అవసరమైన ప్రాథమ్యమనటంలో సందేహం లేదు. అయితే మరుగుదొడ్లు కట్టటంలో అలసత్వాన్ని అలావుంచితే, కట్టినవి సక్రమంగా వినియోగించేలా చేయటంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

భారతదేశంలో కేవలం 47శాతం ఇళ్లకు మాత్రమే లెట్రిన్, స్నానాల సౌకర్యం ఉన్నట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. మొబైల్‌లు, టీవీలు మాత్రం దాదాపు అందరికీ ఉన్నాయి. సురక్షిత లెట్రిన్లు లేకపోవటం వల్ల దాదాపు 62 కోట్లమంది భారతీయులు బహిరంగ మల విసర్జన చేస్తున్నారు. దీనివల్ల జనావాసాల్లో అపరిశుభ్రత పెరిగి వ్యాధులకు కారణమవుతోంది. టాయిలెట్లకు ఎక్కువ నీరు అవసరమవటం, ఎక్కువ స్థలం ఆక్రమిస్తుండటం, ట్యాంకును శుభ్రం చేయాలంటే ఖర్చు తడిసి మోపెడటం వంటి కారణాల వల్ల అవి పెద్దగా వాడకానికి నోచుకోవటం లేదు. అనేక బాలికల పాఠశాలల్లో కూడా మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవటం వల్ల అవి వాడకానికి నోచుకోవటం లేదు. నిర్వహణ సరిగా లేని మరుగుదొడ్డికి, మరుగుదొడ్డి లేకపోవటానికి తేడా ఏమీ లేదు. అలాగే సరైన బాత్ రూంలు, గోప్యతకు అవకాశం లేకపోవటం వల్ల వ్యక్తిగత పరిశుభ్రతకు కీలకమైన స్నానాన్ని చేయటానికి కూడా చాలామంది విముఖత చూపుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారు.

పర్యావరణవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, అపరిశుభ్రత, కలుషిత నీరు ప్రజల అనారోగ్యానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. అనారోగ్యం వల్ల 40శాతం మంది ప్రజలు దారిద్ర్య రేఖ దిగువకు జారిపోతున్నారు. "శరవేగంగా ఆధునికమవుతున్న భారతదేశం తన మలమూత్రాలలో మునిగిపోతోంది" అని భారతీయ సమాజంపై కొంతమంది చేసిన కఠిన వ్యాఖ్యల్ని తప్పుపట్టలేం.

ఇక ఇప్పటి స్వచ్ఛ భారత్ మిషన్‌కొస్తే, భారతదేశం నలుచెరుగులా స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన పారిశుద్ధ్యాన్ని మహాత్మాగాంధీ 150వ జయంతి సంవత్సరమైన 2019 నాటికి సాధించే లక్ష్యంతో గౌరవ రాష్ట్రపతి, ప్రధానమంత్రి "స్వచ్ఛ భారత్ మిషన్"ని ప్రారంభించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 12.5 కోట్ల టాయిలెట్లను నిర్మించి 2019 నాటికి ప్రతి ఇంటికీ,

ప్రభుత్వ సంస్థకూ మరుగుదొడ్డినిను అందించాలని ప్రభుత్వం సంకల్పించింది.

ఇందులో మరుగుదొడ్ల నిర్మాణంలో గతంలో కంటే కూడా వెనకబడివున్నాం. స్వచ్ఛ భారత్‌ని ప్రారంభించిన నాటి నుంచి నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మరుగుదొడ్ల కంటే అదే కాలవ్యవధిలో అంతకుముందున్న యూపీయే ప్రభుత్వం ఎక్కువ టాయిలెట్లను నిర్మించిందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. మరోపక్క, టాయిలెట్ల వినియోగాన్ని పెంచటంలో పాత వైఫల్యమే కొనసాగుతోంది. మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసితో సహా.

### ప్రస్తుతమున్న మరుగుదొడ్లు - లోపాలు

నిర్మల్ భారత్ అభియాన్ (ఎన్‌బిఎ)లో భాగంగా ప్రతి ఇంటికీ ప్రతిపాదించిన వ్యక్తిగత పారిశుద్ధ్య మరుగుదొడ్లు (ఐఎస్ఎల్) రెండు వడపోత గుంతలతో ఉంటాయి. పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాలలోని మరుగుదొడ్ల వ్యవస్థలో రెండు వడపోత గుంతలు లేదా విసర్జన ఇంకిపోయేలా చేసేందుకు సెప్టిక్ ట్యాంకు ఉన్నాయి. అయితే, రెండు వడపోత గుంతల ఐఎస్ఎల్ మోడల్, సెప్టిక్ ట్యాంక్ కమ్యూనిటీ మోడల్ రెండూ వినియోగంలో తగినంత స్థాయిలో పరిశుభ్రతను కల్పించలేకపోతున్నాయి. విసర్జాలు పర్యావరణంలో కాలుష్యరహితంగా ఇంకిపోయేలా (బయో డైజెస్ట్) చేయటంలో ఈ నమూనాలు అవసరమైన స్థాయిలో పనిచేయలేకపోతున్నాయి.

మానవ వ్యర్థాన్ని బయో డైజెస్ట్ చేయటంలో సెప్టిక్ ట్యాంకు లేదా వడపోత గుంతలకున్న ప్రధానమైన సమస్య ఏమిటంటే, వీటిల్లో ప్రక్రియ ఆక్సిజన్ సరఫరాను వినియోగించే ఎయిరోబిక్, వాయురహిత ఎనరోబిక్ – ఈ రెంటిలో ఏదీ పూర్తిస్థాయిలో కాకపోవటం వల్ల విసర్జనకు బ్యాక్టీరియా రసాయన విభజన (ఫెర్మెంటేషన్) పూర్తిస్థాయిలో జరగటంలా. దీంతో, కేవలం అక్కడి పరిస్థితులకనుగుణంగా వ్యవహరించగలిగే కొన్ని బ్యాక్టీరియా రకాలు మాత్రమే ఆ పనిచేస్తుంటాయి. దీనివల్ల విసర్జన చిత్తడి, హెచ్2ఎస్ వాయువు ఏర్పడి దుర్గంధం వెదజల్లుతుంటుంది. ఈ విధానం సురక్షిత స్థాయిలో బయో డైజెషన్‌కి కూడా భరోసా ఇవ్వలేదు. తరచుగా మలవిసర్జన చిత్తడిని తొలగిస్తూండాలి. ఇది దుర్గంధం వెదజల్లేది కావటంతో దీన్ని ఎక్కడికి తరలించాలన్నది పెద్ద సమస్య, గుదిబండ.

పాతకాలపు సెప్టిక్ ట్యాంకుల నైట్రేట్ (ఎన్‌వో3) భూగర్భ జలాల్లో గాఢంగా పేరుకుపోవటానికి దోహదం చేస్తూ చాలా ప్రమాదకర ప్రభావాలకు దారితీస్తుందని కేంద్ర భూగర్భ జలాల బోర్డు కూడా వెల్లడించింది.

ప్రభుత్వ పథకాల ద్వారా నిర్మితమయ్యే వడపోత గుంతల, సాంప్రదాయ సెప్టిక్ ట్యాంకు టాయిలెట్ల వల్ల వచ్చే దుర్గంధాన్ని సాధారణంగా భరింపరానిదిగా ప్రజలు భావిస్తారు.

కాబట్టి ఇకనైనా పాత లోపాల్ని, వైఫల్యాల్ని విశ్లేషించుకుని, కొత్తగా ఆలోచించి కొత్త నమూనాలతో సమర్థవంతమైన, అందుబాటు ధరల్లో ఉండే, కాలుష్యరహితమైన నాగరికమైన, ఆహ్లాదకరమైన లెట్రిన్‌ల నిర్మాణాల్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రూపొందించుకోవాలి. అందరికీ సరైన పారిశుద్ధ్య వసతులు కల్పించాలన్న లక్ష్యం, సంకల్పానికి – అమలుకి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చటమే ఇప్పుడు అసలైన సవాలు. ప్రజలకు టాయిలెట్ వినియోగాన్ని నాగరికతకు చిహ్నంగా అర్థమయ్యేట్టు చెప్పటంతోపాటు చవకైన, పర్యావరణహితమైన, మానవ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి ఎరువులుగా చేసేటువంటి నూతన టాయిలెట్లను అందించటం అవసరం. లేకుంటే వేలకోట్ల రూపాయలు వృధా కావటంతోపాటు కాలుష్యం కూడా పెరుగుతుంటుంది.

వివేకానంద సేవా సమితి (వికాస) సొసైటీ ఫర్ నేచురల్ రిసోర్సెస్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఈ దీర్ఘకాల సమస్యకు ఒక వినూత్న పరిష్కారాన్ని అందించే ప్రయత్నం చేస్తోంది. 'వికాస' సాంప్రదాయిక ఇకోశాన్, సెప్టిక్ ట్యాంకు నమూనాల్ని సమీక్షించి, ప్రపంచవ్యాప్తంగాను, భారత ప్రభుత్వం–డిఆర్‌డివో చేసిన ఇటీవలి పరిశోధనలు, అభివృద్ధి సాయంతోనూ కీలక నిర్మాణ మార్పుల్ని చేసి సమర్థవంతమైన, అందరికీ అందుబాటులో ఉండే రెండు నమూనాల్ని ఆవిష్కరించింది. మానవ వ్యర్థాలను దాదాపు 100శాతం లాభసాటి ఆర్గానిక్ ఎరువుగా రీ సైక్లింగ్ చేసే పద్ధతులివి.

1) ఇకోశాన్ సిస్టం 2) డిఆర్‌డివో బయో–డైజెస్టర్ సిస్టం

ఈ మెరుగుపరిచిన సిస్టంలలో వానపాములు, ఫిల్టర్లు, చుట్టూ మొక్కల పెంపకం వంటి వాటి ద్వారా విసర్జనను చిన్న ముక్కలుగా విభజించే సామర్థ్యాన్ని పెంచటమైంది. ఈ నిర్మాణాలు సమర్థవంతమైనవి, చవకైనవి.

### 'వికాస' నూతన ఆవిష్కరణ నమూనాల ప్రధాన, ప్రత్యేక ఫీచర్లు

**1. లక్ష్యం:**

ఎ. పరిసరాలను పూర్తిగా కాలుష్యరహితం చేయటం

బి. సేంద్రీయ ప్రక్రియ ద్వారా వ్యర్థాన్ని చిన్న ముక్కలుగా చేయటం

సి. మొత్తం వ్యర్థాన్ని లాభసాటి సేంద్రీయ ఎరువుగా మార్చటం

**2. మెరుగుపరిచిన కొత్త సాంకేతిక పరిజ్ఞానం- కొత్త నమూనా**

సాంప్రదాయ లెట్రిన్ నిర్మాణాలైన వడపోత గుంత, సెప్టిక్ ట్యాంకు - రెంటిలోనూ వ్యర్థాన్ని ముక్కలుగా చేయటంలో 60శాతం సామర్థ్యం మాత్రమే కలిగి ఉండటంతో దుర్గంధం, మలవ్యర్థం నిల్వ తొలగింపులో సమస్యలు ఉంటాయి. అందుకే వికాస మెరుగుపరిచిన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన

ఎ. పర్యావరణ శుద్ధి (ఇకోశాన్ నమూనా)

బి. బయొలాజికల్ డైజెస్టర్ (డిఆర్‌డివో నమూనా)లు వ్యర్థాన్ని పూర్తిగా ముక్కలుగా చేసి సురక్షిత సేంద్రీయ ఎరువుగా మార్చటంలో 100శాతం సామర్థ్యం కలిగినవి

ఆర్గానిక్ పదార్థం రసాయన విభజన ఈ రకంగా-

ఎ. ఇకోశాన్ నమూనా- వర్మీ కంపోస్టింగ్ (వానపాములు) ద్వారా ఆక్సిజన్ వినియోగంతో చేసే (ఎయిరోబిక్) ప్రక్రియ

బి బయో డైజెస్టర్ (డిఆర్‌డివో)- మైక్రోబియల్ ఇనోకులంస్‌లతో వాయురహిత (ఎనరోబిక్) ప్రక్రియ (డిఆర్‌డివో అభివృద్ధి చేసింది)

**3. వ్యర్థాల నుంచి సంపద వనరులుగా మార్చటం**

ఎ. మూత్రం వేరుచేయటం

బి. ఘనపదార్థాల్ని కంపోస్ట్‌గా మార్చటం (హ్యూమస్)

సి. నికర లాభం - ఒక వ్యక్తి విసర్జించిన వ్యర్థం, మూత్రం 350 చదరపు మీటర్ల పంట ప్రాంతానికి ఎరువుగా సరిపోతుంది.

**4. టాయిలెట్ సిస్టం నిర్మాణం**

ఎ. సాంప్రదాయ మోడల్- లెట్రిన్ కట్టే చోట రాయి, ఇటుకలు, సిమెంట్ మోర్టార్‌తో నిర్మాణం

బి. నూతన నమూనాలు - రీ ఇన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కలిపిన నిర్మాణం

1. అవసరమైన అన్ని నిర్మాణ భాగాలనూ ఒకేచోట ముందుగానే తయారు చేయటం (ప్రీ ఫ్యాబ్రికేషన్)
2. నిర్మాణాన్ని చేసే చోటికి తీసుకెళ్లి వాటిని అమర్చటం

**5. సాంప్రదాయ టాయిలెట్ ధర వర్సెస్ నూతన నమూనా ధర**

ఎ. ఇకోశాన్- పాత మోడల్ ధరరూ. 18,000 నుంచి 20,000 వరకు

వర్సెస్

నూతన మోడల్ ధర రూ. 12,000

బి. బయో డైజెస్టర్ డిఆర్‌డివో - రూ. 22,000

వర్సెస్

నూతన మోడల్ రూ. 15,000

**6. పర్యావరణ పరిశుభ్రత - సామర్థ్యం**

ఎ. సాంప్రదాయ మోడల్‌లో - 60శాతం

**7. జాతీయస్థాయిలో ప్రత్యక్ష, పరోక్ష లాభాలు**

ఎ. ఖర్చులో ఆదా

- ఒక్కో లెట్రిన్ మీద సుమారు రూ. 8,000
- ఈ లెక్కన 13 కోట్ల టాయిలెట్లకు రూ. 1,00,000 కోట్లకు పైగా ఆదా అవుతుంది

బి. డబ్బు భారీగా ఆదాతోపాటు 100శాతం పర్యావరణ పరిశుభ్రత

సి. 25శాతం మేర ఆర్గానిక్ ఎరువులు అందుబాటులోకి. ఇది జాతీయావసరం.

## డిజైన్ ప్రతిపాదనలు, పనిచేసే పద్ధతి

ఎ. పర్యావరణ తరహా పొడి లెట్రిన్: ఇకోశాన్ నమూనా

సాంప్రదాయ లెట్రిన్‌లో విసర్జనల బయో డైజెషన్‌కి వడపోత గుంతల్ని భూమిలోపల నిర్మించి పైన ఒక మూత ఉంచుతారు. ద్రవరూప విసర్జనలు రాతి కట్టడంలోని రంధ్రాలు లేదా సన్నని సందుల ద్వారా లేదా గుంతల కాంక్రీట్ లైనింగ్ ద్వారా భూమిలోకి కుంగుతాయన్నది దీని వెనక సూత్రం. వడపోత గుంతల స్థానంలో భూమి పైన ఇంకుడు గదుల ఏర్పాటు ఉంటుంది. విసర్జనలు సమర్థవంతంగా పొడిబారి ఆక్సీకరణ ప్రారంభించటానికి వీలుగా. ఇకోశాన్ పద్ధతిలో మలవ్యర్థ పదార్థాలు తేలిగ్గా పొడిబారి, వినియోగించిన ప్రతిసారీ బయో డైజెషన్ వేగాన్ని పెంచి కంపోస్టుగా మార్చేందుకు ఇసుక ధూళి, బూడిద, సున్నం లేదా మెత్తటి మన్ను వంటివి కలపాలని ప్రతిపాదించటమైనది. మానవ వ్యర్థం వానపాముల ద్వారా గాలి వినియోగం, ఆక్సీకరణ ద్వారా గణనీయరీతిలో కంపోస్టు అవుతుందని, సేంద్రీయ వృధాని అవి వినియోగించుకుంటాయని అనేక పరిశోధనలు నిరూపించాయి. ఈ నేపథ్యంలో, బయో డైజెషన్ గదుల్లోకి వానపాముల్ని

ప్రవేశపెట్టాలని ప్రతిపాదించటమైంది. ఈ ప్రక్రియ వల్ల ఎంతో విలువైన కంపోస్టు తయారవుతుంది. మూత్రం కూడా మంచి ఎరువే, దీన్ని నిర్వహించటం సురక్షితం కూడా. కాబట్టి మూత్రాన్ని వేరే పెట్టెలోకి సేకరించేందుకు ప్రత్యేక మార్గం ఉండేలా నీటి ఆధారిత టాయిలెట్ పంపు(డబ్ల్యుసి)ని డిజైన్ చేయటమైంది.

**ఈ ఆవిష్కరణ వల్ల లాభాలు :**

1. అశుద్ధ పదార్థంనుంచి నీరు కలుషితం కాకుండా నివారించటం ఈ ఆవిష్కరణ ప్రధానోద్దేశం

2. ఒక వ్యక్తి నుంచి వచ్చే మూత్రం 350 చదరపు మీటర్ల ప్రాంతంలోని పంటలకు ఎరువుగా ఉపయోగపడగలదని పరిశోధనల్లో తేలింది. అధిక దిగుబడులకు ఉద్దేశించిన సాంప్రదాయేతర సాగు ప్రాంతంలో ఇది చాలా పెద్ద శాతంగా చెప్పవచ్చు

3. ఇందులో తయారైన కంపోస్టు, నేల పోషకాల్ని పెంచే మంచి ఎరువు (హ్యూమస్). నేలలో నైట్రోజన్‌ని ఇది ప్రభావశీలంగా పరిరక్షించగలుగుతుంది.

**బి. మెరుగుపరిచిన సెప్టిక్ ట్యాంకు – డిఆర్‌డివో నమూనా**

సెప్టిక్ ట్యాంకు సమస్యల్ని అధిగమించటానికి డిఆర్‌డివో బయో డైజెస్టర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరిచింది. ఇది సూక్ష్మజీవుల కూటమిని వినియోగించి ఆక్సిజన్‌లేని వాతావరణంలో (ట్యాంకు లోపల) వాయురహిత పరిస్థితుల్లో ఫెర్మంటేషన్‌ని చేస్తుంది. ఇది పూర్తిగా ఎనరోబిక్ ప్రక్రియ కావటంతో, ఆర్గానిక్ పదార్థం బయో డీజనరేషన్ దాదాపు పూర్తిగా (99శాతం) జరిగి, వ్యర్థాలు బురదలా ఏర్పడటం, హెచ్2ఎస్ ఉత్పత్తికావటం ఉండదు.

బయో డైజెస్టర్ పరికరం అన్ని వైపులా మూసివేసి ఉంటుంది. శుద్ధి చేసిన విసర్జనలు మాత్రమే ద్వారం నుంచి బైటికొస్తాయి, మరోవైపు గ్యాస్ పైప్ నుంచి బయోగ్యాస్ వస్తుంటుంది.

సాంప్రదాయ సెప్టిక్ ట్యాంకుల కన్నా బయో డైజెస్టర్ టెక్నాలజీ వల్ల ఈ దిగువ పేర్కొన్న అనేక ప్రయోజనాలున్నాయి:

**1. తక్కువ స్థలంలోనే:** నిర్దేశించిన సంఖ్యలో వ్యక్తులు వినియోగించే బయో డైజెస్టర్ పరిమాణం సాధారణంగా ఉపయోగించే సెప్టిక్ ట్యాంకుల పరిమాణం కన్నా తక్కువ. స్థలాభావం ఉన్న చోట కూడా బయో డైజస్టర్‌లను ఏర్పాటుచేసుకోవచ్చు

**2. అందుబాటు ఖర్చులో:** బయో డైజెస్టర్ ఏర్పాటుకయ్యే ఖర్చు కూడా ఎప్పుడూ సాంప్రదాయ ట్యాంకులకయ్యేదాని కంటే తక్కువే. దాంతోపాటు బయో డైజస్టర్లను శుభ్రం చేయాల్సిన పని ఉండదు. అందువల్ల మళ్లీమళ్లీ శుద్ధి కోసం సెప్టిక్ ట్యాంకులకయ్యే ఖర్చు వీటికి ఉండదు

**3. వ్యర్థం వేగంగా ఇంకుతుంది:** వ్యర్థాన్ని వేగంగా కిందికి జార్చి ఇంకిపోయేలా చేయటంలో రంగు, వాసన, బివోడి, సివోడి, రంగు, వ్యాధికార సూక్ష్మజీవుల కట్టడి తదితర కోణాలన్నిటిలో సాంప్రదాయ సెప్టిక్ ట్యాంకుకన్నా బయో డైజస్టర్ చాలా మెరుగ్గా ఉంటుంది

**4. టాయిలెట్ క్లీనర్లు వినియోగించుకోవచ్చు:** టాయిలెట్ శుభ్రపరిచే క్లీనింగ్ ద్రవాలు, పౌడర్లను బయో డైజెస్టర్‌లో సమపాళ్లలో వినియోగించుకోవచ్చు. సెప్టిక్ ట్యాంకులో వీటిని వాడకూడకూడదు

**5. ఇంధనం లభిస్తుంది:** బయో డైజెస్టర్ నుంచి వచ్చే బయోగ్యాస్‌లో కార్బన్ డై ఆక్సైడ్, మిథేన్ ఉంటాయి. ఈ బయోగ్యాస్‌ని ఇంధన వనరుగా ఉపయోగించుకోవచ్చు.

**6. తేలిగ్గా అమర్చుకోవచ్చు:** దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, ఎలాంటి వాతావరణంలోనైనా బయో డైజస్టర్‌ని తేలిగ్గా అమర్చుకోవచ్చు. అదే సెప్టిక్ ట్యాంకుల ఏర్పాటుకు కొన్ని పరిమితులున్నాయి

**7. పర్యావరణ హితం:** సెప్టిక్ ట్యాంకు నుంచి వెలువడేవి (వాయువు, విసర్జన బురద, ద్రవం) వ్యర్థపదార్థాలుగా పర్యావరణానికి హాని చేస్తాయి. కానీ బయో డైజస్టర్ నుంచి వచ్చే ద్రవ, వాయువులను సాగు, ఇంధన అవసరాలకు వాడుకోవచ్చు

**8. నిర్వహణ తేలిక:** బయో డైజస్టర్‌ని ఒకసారి అమర్చాక శుభ్రం చేయటం లేదా ఇతరత్రా నిర్వహణ భారాలేవీ ఉండవు. అదే సెప్టిక్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాల్సుంటుంది. ఇలా శుభ్రం చేయటం చాలా సందర్భాలలో అనైతికమైన రీతిలో మనుషులే చేస్తుంటారు

**కొలతలకు తగ్గట్టు ముందుగా తయారు చేసిన బయో డైజస్టర్ టాయిలెట్**

**(ప్రీ ఫ్యాబ్రికేటెడ్, మాడ్యులర్)**

బయో డైజస్టర్‌తో ఒక కొత్త మాడ్యులర్ స్నానం చేసే

ఏర్పాటుతో కలిసిన లెట్రిన్‌ను అభివృద్ధి చేయటమైంది. ఈ టాయిలెట్ కమ్ బాత్ సిస్టం ఒక పెట్టెలాగా ఉంటుంది. అవసరమైన అన్నీ తగిన కొలతలతో రీ ఇన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్‌తో ప్రీ ఫ్యాబ్రికేటెడ్ అయిఉండి తేలిగ్గా టాయిలెట్‌లాగా కూర్చోటానికి (అసెంబుల్) వీలుగా ఉంటాయి.

**ఇకోశాన్, డీఆర్‌డీవో నమూనాల బయో డైజెస్టర్ సిస్టం ప్రధాన ప్రయోజనాలు**

■ మంచి పారిశుద్ధ్య విధానం

బయో డైజెస్టర్‌కి కనీసస్థాయి నిర్వహణ ఉంటే చాలు. రసాయన విభజనకు విసర్జన ఘనపదార్థానికి యాంత్రిక, విద్యుత్తు గాలి సరఫరా అవసరంలా. వ్యర్థాన్ని మనుషులు ముట్టుకోనక్కర్లా. క్రిముల్ని వ్యాపింపచేసే కీటకాలను ఆకర్షించే వాసనలు, మురుగు ఇందులో ఉత్పత్తి కావు. కాంక్రీట్‌తో తయారైన డైజెస్టర్ డిజైన్ వల్ల సాంప్రదాయ గుంతల లెట్రిన్‌లలోలాగా ఎలకలు వంటివి డైజస్టర్‌లోకి కన్నం పెట్టే అవకాశం ఉండదు

**■ చాలా తక్కువ స్థలంలోనే**

బయో డైజెస్టర్ ఛాంబర్‌పైన ఉండే లెట్రిన్, బాత్ సహా నిర్మాణమంతటికీ 6, 7 అడుగులు మాత్రమే అవసరమవుతుంది. సాంప్రదాయ సిస్టంలతో పోలిస్తే బయో డైజెస్టర్‌కి కావలసిన భూమి చాలా కనీసస్థాయిలోనిది.

**■ పర్యావరణ హితం**

డైజస్టర్ పరికరం, విసర్జనను కిందికి పంపే పైపులు భూగర్భ జలాలకు పైనే ఏర్పాటు చేసి ఉంటాయి కాబట్టి నీరు కలుషితమవటం పూర్తిగా నివారించబడుతుంది. వ్యర్థాన్ని పూర్తిగా ఎయిరోబిక్ ప్రక్రియలోనే ట్రీట్ చేయటం వల్ల వాసన, వాయు కాలుష్యం ఉండదు. సెప్టిక్ ట్యాంకు లేదా గుంతల టాయిలెట్లలోలాగా కాకుండా, ఖర్చుతో కూడిన నిర్మాణావసరాలు, క్రమం తప్పకుండా శుభ్రం చేయటం అవసరం బయో డైజెస్టివ్ సిస్టంలో అక్కర్లేదు.

**■ నీరు ఆదా**

స్నానం చేసే ప్రాంతం (బాత్ రూం) నుంచి వచ్చే నీటిని టాయిలెట్ నుంచి వేరు చేయటంతో ఆ నీటిని వంటగదిలో, మొక్కల పెంపకంలో వాడుకోవచ్చు. లేదంటే, ఆ నీటినే వాటర్ హార్వెస్టింగ్ కోసం ఇసక ఫిల్టర్‌లో వాడవచ్చు.

**■ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం తగ్గుతుంది**

ఈ కొత్త సిస్టం భూగర్భ/ఉపరితల నీరు, వాయు కాలుష్యాలు లేకుండా పనిచేస్తుంది. మిథేన్ వాయువుల్ని నేరుగా వాతావరణంలోకి వదలటం ద్వారా గ్రీన్‌హౌస్ వాయువులు వెలువడటాన్ని బాగా తగ్గించగలుగుతుంది.

**■ నిర్మాణం, కార్మికుల మీద ఖర్చులో ఆదా**

గోడలు, తవ్వకాలు, పునాది, కప్పు సహా మొత్తం యూనిట్ నిర్మాణం ప్రీ ఫ్యాబ్రికేటెడ్ ఆర్‌సీసీ ప్యానల్స్, స్తంభాలతో పూర్తవుతుంది కాబట్టి ఇక టాయిలెట్ ఏర్పాటు చేసే చోట ప్రత్యేకించి నిర్మాణం చేయాల్సిన అవసరముండదు. కావలసిందల్లా, ముందుగా తయారు చేసిన విడిభాగాలను టాయిలెట్ ఏర్పాటుచేసే స్థలంలో అమర్చేందుకు మామూలు సహాయకులు మాత్రమే.

**'వికాస' విజ్ఞప్తి**

ఇటువంటి పటిష్టమైన, తేలికైన ముందుగానే విడిభాగాలను తయారుచేసి అందించే టాయిలెట్, స్నానాల సిస్టం ఈ ప్రాంతం, ఆ ప్రాంతం అనికాకుండా, కొండలు, నీటి కొరత ఉన్న ప్రాంతాలు, వరద, తీర ప్రాంతాలు, భూగర్భ జలాలు తక్కువగా ఉన్న ప్రాంతాలు ఇలా అన్ని చోట్లకూ పనికొస్తుంది. అందుబాటు ఖర్చులో, తక్కువ స్థలంలో ఏర్పాటు చేసుకోవచ్చు. ముఖ్యంగా, మొక్కల, పంటల పెంపునకు సురక్షిత సేంద్రీయ ఘన, ద్రవ ఎరువుని ఇది అందిస్తుంది. ఈ సిస్టంని తేలిగ్గా అమర్చుకోవచ్చు. పెద్ద నైపుణ్యాలున్న కార్మికులు కూడా అక్కర్లేదు. అదే రాళ్లు, ఇటుకలతో కట్టే సాంప్రదాయ టాయిలెట్ల నిర్మాణంలో నైపుణ్యాలున్నవారితోపాటు బయో నమూనాలో కంటే ఎక్కువ నిర్మాణ ఖర్చును కూడా వెచ్చించాల్సి ఉంటుంది. వాడుకకు అందుబాటులోకి రావటానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది.

కాబట్టి, ప్రతి యూనిట్‌కూ ఆమోదముద్ర ఉన్న అందుబాటు ధరలో ఈ కొత్త టాయిలెట్, స్నానాల నమూనాల్ని నిర్మించుకుని మనకు అన్నిరకాలుగా మేలు చేసే మంచి పర్యావరణానికి అనువైన పరిస్థితుల్ని 100శాతం ఏర్పరుచుకుందామని విజ్ఞప్తి చేస్తున్నాం. ★

**ఎం. ధర్మారావు**

మాజీ చీఫ్ ఇంజినీర్,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

ఫోన్: 9440501333

email: mdharmarao.water@gmail.com

# పార్లమెంటు పనిచేయకపోతే దేశానికి నష్టం, ఎంపీల జీతాలు తెగ్గోయాల్సిందే: ప్రజాభిప్రాయం

పార్లమెంటును అడ్డుకోవటం ఆర్థిక వ్యవస్థను, పరిపాలనను తీవ్రంగా నష్టపరుస్తోందని ఓ ఆన్‌లైన్ సర్వేలో 90శాతం మంది అభిప్రాయపడ్డారు. పార్లమెంటును స్తంభింపచేయటం దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోంది కాబట్టి, అటువంటి సమయాల్లో ఎంపీల జీతాలను తెగ్గోయాలని సర్వేలో పాల్గన్న మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు. ఇక దేశంలో అసహనం పెరిగిపోతుందంటూ వస్తున్న విమర్శలపై పార్లమెంటులో చర్చించాలని 55శాతం మంది సూచించారు. ఎక్కువ మంది పౌరులు అభిప్రాయాలను వ్యక్తం చేసే వేదికల్లో ఒకటిగా గుర్తింపుపొందిన లోకల్ సర్కిల్స్ పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా ఈ సర్వేను నిర్వహించింది. సుమారు 14,000 మంది ఈ పోల్ ప్రశ్నలకు స్పందించారు. వీరిలో దాదాపు అందరూ పార్లమెంటు నిర్వహణ అధ్వాన్నంగా ఉండటం పట్ల తీవ్ర ఆగ్రహాన్ని, ఆవేదనని వ్యక్తంచేశారు. సభ




జరగకపోవటం వల్ల కీలక బిల్లులు ఆగిపోయి ప్రభుత్వ నిర్వహణ కుంటుపడుతుందన్నారు. ప్రధాని మోదీ అదనపు ప్రయత్నాల వల్ల సభ నిర్వహణకు అవకాశాలు మెరుగవుతాయని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ★

# లక్షల కోట్ల సెస్సు, వినియోగం తీరుపై 'కాగ్' ఆక్షేపణ

పన్నుగాని పన్నులాగా ఒక స్పష్టమైన అవసరం పేరుతో సుంకం (సెస్సు) వసూలు చేసే సంస్కృతి పెరిగిపోవటం ఓపక్క వివాదాస్పదమవుతుండగా, మరోపక్క ఇలా సెస్సు పేరుతో ఏటా ప్రజలు చెల్లిస్తున్న వేలకోట్ల రూపాయల వినియోగం అంతంతమాత్రంగానే ఉందని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆక్షేపించింది. పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సెస్సు ఖర్చవుతున్న తీరును ప్రత్యేకంగా కాగ్ ప్రస్తావించింది. భారీగా డబ్బు ఆ పేరుతో జమ అవుతున్నా, అందుకోసం ఖర్చు చేయటం లేదని పేర్కొంది. దేని కోసం సెస్సును వసూలు చేస్తే దానికే ఖర్చు చేయాలి. ఉన్నత విద్య, రహదారి అభివృద్ధి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం తదితర అవసరాల కోసం ప్రభుత్వం ఇప్పటికే 1.4 లక్షల కోట్లకు పైగా నిధుల్ని సమీకరించింది. పాత సెస్సులకు అదనంగా స్వచ్ఛ భారత్ కోసం 0.5 శాతం సెస్సు వసూలు చేయనున్నట్టు ఇటీవల ప్రకటించింది. విమానయాన ప్రాంతీయ అనుసంధానత కోసమూ త్వరలో సెస్సు వేయనుంది. 2006-15 కాలంలో ఒక్క ఉన్నత విద్యాసెస్సు రూపంలోనే రూ.64,288 కోట్లు వసూలు చేసి వినియోగించకుండా వదిలేశారు. టెలికాం సేవలు సమకూర్చేవారి వద్ద నుంచి వసూలు చేసిన 'యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్' (యూఎస్‌వో) సెస్సు రూ.66,117 కోట్లు దాటితే దానిలో సగమైనా ఖర్చు చేయలేదు. ఖర్చు చేయాల్సిన డబ్బులో రూ.39,000 కోట్లకు పైగా మొత్తాన్ని అసలు యూఎస్‌వో నిధికి కూడా బదలాయించలేదు. దీనిలో పెద్దమొత్తం ఇతర అవసరాలకు మళ్లిపోయినట్టు భావిస్తున్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి కింద 2014 డిసెంబర్ వరకు రూ.16,214 కోట్లు వసూలైతే కేవలం రూ.2860 కోట్లు ఖర్చు చేశారు. ఇక రైతుల నుంచి వసూలు చేసే మార్కెట్ సెస్సులు ఎలా దుర్వినియోగమవుతున్నాయో చెప్పనక్కర్లేదు. రైతులకేదో చేసేస్తున్నట్టు నటిస్తూనే.. దళారులు లేకుండా పంటలకు ధర లభించేందుకు ఉపయోగపడాల్సిన మార్కెట్ యార్డుల్ని రాజకీయ నాయకులు కబ్జా చేస్తేన్నారు. అధికార పార్టీల అడ్డాగా మార్కెట్ యార్డులు తయారయ్యాయి. తెలుగు రాష్ట్రాలలో వందల కోట్ల సెస్సు ఇలా పక్కదోవపడుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మార్కెట్ యార్డులను రైతులకే అప్పచెప్పి, వ్యవసాయోత్పత్తుల మీద వసూలు చేసిన సెస్సును రైతుల కోసమే ఖర్చు చేసి ఉంటే, కొంతమేరైనా వారికి ఆదాయం పెరిగేది. ★

# మహిళలపై ఆగని వేధింపులు, దారుణాలు, మార్పు మన చేతుల్లోనే

- ఎ.అన్నపూర్ణ




కొద్దికాలంగా తగ్గుతున్నాయి కాబోలు.. అనుకుంటుండగానే వరకట్న వేధింపులు, డబ్బు కోసం భర్తలు చేసే దారుణాల వార్తలు మళ్లీ పెరుగుతున్నాయి. మహిళల పట్ల ఇంకా సమాజం దృక్పథంలో మార్పు రాలేదు అనటానికి ఇవి ఆటవిక ఉదాహరణలు. చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న వారిలోనూ, భర్త మీద ఆధారపడిన గృహిణుల్లోనూ ఒకే రకమైన వత్తిడి. హింస జరగటం విచారం కలిగిస్తోంది.

ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిలకు కూడా వరకట్న వేధింపులు, తాళం వేసి వున్న భర్త ఇంటి ముందు దీనంగా పడిగాపులు కాయటం తప్పటం లేదు. కట్నం అనే పేరు లేకపోయినా రకరకాల పేర్లతో ఆ అవమానకర దురాచారం కొనసాగుతోంది. పెళ్లి పేరుతో చేసే దుబారా కూడా అంతులేకుండా సాగుతోంది. హోదాకి తగ్గట్టు పెళ్లి చేయాలనటం లేదా అడగకపోయినా తమ గొప్ప చూపించుకోవటానికి అమ్మాయి తరపువారో, అబ్బాయి తరపువారో భారీగా ఖర్చు చేయటం చూస్తుంటే ఎంత కృత్రిమ ప్రపంచంలో మనం జీవిస్తున్నామో, ఎంత డబ్బుని వృధా చేస్తున్నామో అని బాధ కలుగుతుంది. పెళ్లిభోజనం 'సంప్రదాయ వంటకాల విందు' అనే అర్థం ఎప్పుడో మారిపోయింది. ఒక పెళ్లిలో అరవై రకాల వంటకాలు చేశారని, మరో పెళ్లిలో ఎన్ని రకాలున్నాయో లెక్కే లేదని పోటాపోటీగా చెప్పుకోవటం అనాగరికం అనుకోవటం లేదు. అదో స్టేటస్ సింబల్ అయిపోయింది. ఆ ఒక్కరోజు ఈవెంట్‌ని ఎవరు గుర్తుంచుకుంటారు? చివరికి చేసినవారికే గుర్తుండటం లేదు. ఇంతా చేసి ఆరునెలలు తిరిగే సరికి మర్యాదలు, కానుకలు చాలలేదని గొడవలు పడటం కూడా ఎక్కువవుతోంది.

**రాజకీయాల్లో కూడా ప్రభావం చూపుతున్నారు. కానీ భార్యను చులకనగా చూసే సంప్రదాయం మధ్య ఇంట్లో వేధింపుల్ని తట్టుకుని గెలవగలగటం ఇంకా చాలామంది మహిళలకు కష్టసాధ్యమైన పనిగానే ఉంది. డబ్బు ఉండి అక్రమ సంబంధాలు, దుర్వ్యసనాలకు పాల్పడుతున్న పురుషులు భార్యాబిడ్డలనే మమకారాన్ని వదులుకుంటున్న ఘటనల్లో మహిళలకు ఎదురయ్యే సవాలు ఇంకో రకంగా ఉంది.**

అత్తమామల వేధింపులు ఒకరికి, భర్త వేధింపులు మరొకరికి, భార్య ఉద్యోగం చేస్తే ఆ జీతం తనకే ఇవ్వాలని తనకు తెలియకుండా ఖర్చు చేయరాదని ఆంక్షలు విధించటం లేదంటే మనస్పర్థలు మీడియాలో రచ్చ, విడాకుల దాకా పోవటం జరుగుతోంది.

భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకుని సజావుగా కాపురాలు చేసుకోవటం ఓ ఘనకార్యంలా మారిపోతోంది. ఆడ, మగ మధ్య విచక్షణ చూపటం ఎప్పుడో మొదలైనా, ఇప్పటికీ ఏదోక ముసుగులో పెద్దఎత్తునే కొనసాగుతోంది. అబ్బే, ఈరోజుల్లో సంపాదనలోగానీ, ఇల్లు దిద్దుకోవటంలోగానీ ఆడ, మగ తేడా లేదండీ అంటూ మాటలు చెబుతుంటారు, చేతల్లో మాత్రం వేరేగా వ్యవహరిస్తారు. భర్త ఉద్యోగం కోల్పోతే అతగాడి




దృష్టి మామగారి ఆస్తి మీద పడుతుంది. మామగారు రోజు కూలీ అయినా సరే, మీ పుట్టింటి వాళ్ల దగ్గర్నుంచి తీసుకురా, తర్వాత ఇచ్చేద్దాం అంటుంటాడు. కాస్త ఉన్నవాళ్లు ఎలాగోలా డబ్బులు కూడగట్టి ఒకటి రెండు సార్లు ఇచ్చాక, నీ వాటా ఆస్తి రాసిమ్మను, ఎటూ ఈ రోజుల్లో అమ్మాయికి కూడా హక్కు ఉంటుంది అంటాడు. తనకు ఆధారం పోతే కష్టమని పుట్టింటి వనరుని ఇవ్వటానికి భార్య అంగీకరించకపోతే, ఇక వేధింపులు ప్రారంభ మవుతాయి. విడాకులు ఇచ్చేయ్, కట్నం తీసుకుని మరో పెళ్లి చేసుకుంటానంటూ నిస్సిగ్గుగా బెదిరింపులు మొదలెడతాడు. సామాజిక మాధ్యమాలలో చెలరేగిపోతూ అవమానిస్తాడు. సంపాదన లేకపోయేసరికి డిప్రెస్ అయిపోతూ విపరీత మనస్తత్వానికి లోనవుతున్న పురుషుల కేసులు రోజూ చదవాల్సి వస్తోంది. ఎంత గొప్ప ఆదాయం వచ్చేవి అయినా ఈరోజుల్లో ఉద్యోగాలు శాశ్వతం కాదు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏరోజు ఎవరికి ఉద్వాసన చెబుతాయో తెలియదు. రాబోయే కాలంలో ఈ వరవడి పెరుగుతుంది. ఇందులో వారిని పెద్దగా తప్పుపట్టాల్సిందేమీ లేదు కూడా. నైపుణ్యాల్ని పెంచుకోవటం, కష్టపడి పనిచేయటం, భేషజాలకు పోకుండా ఒద్దికగా బతుకుతూ పొదుపు చేయటం వంటివి చేస్తే ఇలా పరాన్నజీవిలా బతకాల్సిన పనుండదు గదా? మనిషిగా దిగజారే దుస్థితి రాదు గదా? భర్తకు కష్టసమయాల్లో సహాయసహకారాల్ని అందించాల్సిందేగానీ, అత్తమామల్ని అడిగితెమ్మంటూ అభిమానాన్ని చంపుకుని వేధించే ధోరణుల్ని భార్య కూడా వ్యతిరేకించాలి. ఈమధ్య ఒక రాజకీయ నాయకుని కోడలు.. భర్త, అత్తమామల వేధింపుల్ని భరించలేక పిల్లలతో సహా బలికావటం విచారం కలిగిస్తుంది. ఇలాంటి పిరికితనం లేకుండా ఆచరణాత్మకంగా వ్యవహరించాలి, చాకచక్యంతో, సహనంతో సమస్యల నుంచి బైటపడాలి. ఆధునిక యుగంలో మహిళలు ఉన్నత విద్యా వంతులవుతున్నారు, రాజకీయాల్లో కూడా ప్రభావం చూపుతున్నారు. కానీ భార్యను చులకనగా చూసే సంప్రదాయం మధ్య ఇంట్లో వేధింపుల్ని తట్టుకుని గెలవగలగటం ఇంకా చాలామంది మహిళలకు కష్టసాధ్యమైన పనిగానే ఉంది. డబ్బు ఉండి అక్రమ సంబంధాలు, దుర్వ్యసనాలకు పాల్పడుతున్న పురుషులు భార్యాబిడ్డలనే మమకారాన్ని వదులుకుంటున్న ఘటనల్లో మహిళలకు ఎదురయ్యే సవాలు ఇంకో రకంగా ఉంది.

మహిళా న్యాయస్థానాలు, కౌన్సెలింగ్ సెంటర్లు, మహిళా పోలీసు స్టేషన్లు, సంక్షేమ కేంద్రాలు, పునరావాస కేంద్రాలు ఎన్నెన్నో ఉన్నా మహిళల వేదన తీరటం లేదు. భార్యాభర్తల మధ్య సయోధ్య కుదర్చలేకపోతున్నాయవి. ఇలాంటి కేసుల్లో నూటికి సగమందికి సయోధ్య సంగతి అలా ఉంచితే, ఎలాంటి పరిష్కారమూ లభ్యం కావటం లేదు. నెలనెలా నష్టపరిహారం ఇవ్వాలని కోర్టు చెప్పినా ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఒకేసారి కొంత సొమ్ముని ఇప్పించినా అది సరిపోదు. పిల్లలను సంక్షేమ హాస్టల్స్‌లో చేర్చి ఏదో విధంగా గడుపుతున్నారు ఆ మహిళలు. తల్లీతండ్రీ కలిసి ఉంటేనే పిల్లలను తీర్చిదిద్దుకోవటం చాలా కష్టం. అటువంటిది విడిపోయిన వారి పిల్లల మానసిక స్థితి ఎంత అయోమయంగా ఉంటుంది?

పిల్లల భవితను చక్కగా తీర్చిదిద్దుకోవాలంటే భార్యాభర్తలిద్దరూ తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సిందే. పరిస్థితులు, ఇంటి వాతావరణం పిల్లల మీద తప్పకుండా ప్రభావం చూపిస్తాయి. ఆనందాన్ని కోల్పోతూ అసహనాన్ని పెంచుకుంటున్నామా అంటే దానికి సరైన కారణాలను తెలుసుకుని సరిదిద్దుకోవాలి.

వీటన్నిటినీ మహిళలు తట్టుకుని అధిగమించాలంటే, నిరోధించాలంటే, మగవాళ్లు అహంకారాన్ని వదిలి సంసారాన్ని దిద్దుకునే సంస్కారాన్ని పెంచుకోవాలంటే.. మనం విద్యలో, కుటుంబ జీవితంలో నాణ్యతను పెంపొందించుకోవాలి. అందరికీ సరైన విద్య, పెంపకం, కనీసం చట్టబద్ధ పాలన రాజకీయ సంస్కృతి ఉంటే మంచి తల్లిదండ్రులు తయారై పిల్లలు ఆరోగ్యంగానూ, ఆనందంగానూ పెరిగే సమాజం ఏర్పడుతుంది. మార్పు మన చేతుల్లోనే ఉంది. ★

# ఉగ్రదాడుల విధ్వంసం నుంచి భారత్-పాక్ శాంతి చర్చల్ని కాపాడుకోవాలి: జేపీ

పంజాబ్ పఠాన్‌కోట్‌పై జరిగిన ఉగ్రవాద దాడి హేయమైనదని, ఉగ్రవాదాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని, అదేసమయంలో పాకిస్తాన్‌తో శాంతి చర్చల్ని ధ్వంసం చేయకుండా మనం అప్రమత్తమవ్వాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఇప్పుడు మనం చర్చల నుంచి వైదొలగితే, భారత్, పాకిస్తాన్ భవిష్యత్తుని ఇక ఉగ్రవాద బృందాలు నిర్ణయించటం మొదలుపెడతాయని జేపీ హెచ్చరించారు. మనం చర్చల ప్రక్రియను కొనసాగిస్తూ సుస్థిర శాంతిని నెలకొల్పాలన్నారు. ఆగ్రహాన్ని, విద్వేషాల్ని, అశాంతిని ప్రేరేపించటానికి ఉగ్రవాదం ప్రయత్నిస్తూంటుందని.. పటిష్ట భద్రత, చర్చలు, శాశ్వత పరిష్కారంతోనే మనం సమాధానం చెప్పాలని జేపీ అన్నారు. ఇది దీర్ఘకాలిక ప్రక్రియన్నారు. చేదు, విద్వేష చరిత్రలోనే ఎల్లకాలం మగ్గలేమని, మనుగడ కోసం పాకిస్తాన్‌కి, అభివృద్ధి, ఆర్థిక అద్భుతాల కోసం భారత్‌కీ శాంతి కావాలని జేపీ అన్నారు. ఉగ్రదాడుల విషయంలో ఎలక్ట్రానిక్ మీడియా సంయమనం పాటించాలని జేపీ కోరారు. "యుద్ధోన్మాద భాషను అదేపనిగా ఉపయోగిస్తూ రెచ్చగొట్టటం వల్ల దేశ ప్రయోజనాలు దెబ్బతింటాయి. సహనం బలవంతుల లక్షణం'' అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# భారత్ వృద్ధికి కీలకమైన విజ్ఞానరంగంలోనూ పెట్టుబడులు అరకొరే

భారత్ ప్రపంచాన్ని ఏలేయబోతోంది, ఎటుచూసినా మనమే అని ప్రధానమంత్రి ఊదరగొడుతున్నా అందుకు కావలసిన విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారత, పరిశ్రమలు తదితర రంగాల్లో సంస్కరణల్ని మాత్రం ఆయన చేపట్టలేకపోతున్నారు. తాజాగా విజ్ఞానశాస్త్ర నోబెల్ విజేతలు కూడా ఇదేతరహాలో పెదవి విరిచారు. భారత్‌లో విజ్ఞానరంగానికి తగిన స్థాయిలో నిధుల కేటాయింపులు లేవని మైసూరులో 103వ విజ్ఞాన సదస్సుకి హాజరైన నోబెల్ పురస్కార గ్రహీతలు డేవిడ్ గ్రాస్, వి.గుర్థన్, ఆచార్య సెర్జ్ హరోచ్, డాన్ దచ్‌మాన్, శాస్త్రసాంకేతిక రంగాల నిపుణుడు, ఫీల్డ్ మెడలిస్ట్ ఆచార్య మంజల్ భార్గవ్ అన్నారు. "గత పదేళ్లలో జాతీయ అభివృద్ధి సూచీ రెట్టింపు అయింది. విజ్ఞాన రంగానికి కేటాయింపులు మాత్రం పెరగలేదు. ఆర్థికవృద్ధికి సమానంగా విజ్ఞానరంగానికి నిధుల కేటాయింపు పెరిగినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుంది. చైనాలో విజ్ఞానరంగానికి అత్యధికంగా కేటాయింపులు ఉంటున్నాయి. అందుకే ఆ దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. భారత్ నుంచి మేధో వలసల్ని నివారించాలని అంటున్నారు. ఇక్కడ మంచి అవకాశాల్ని కల్పిస్తే విదేశాలకు వెళ్లాల్సిన అవసరముండదు. నేతలు స్వల్పకాల ఫలితాలనిచ్చే రంగాలు, కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అందుకే దీర్ఘకాలిక దృష్టితో విజ్ఞానరంగంలో పెట్టుబడులు పెట్టటం లేదు" అని వారు వ్యాఖ్యానించారు.

# లోక్‌సత్తా ఆరేళ్ల పోరాటంతో పేదలకు తిరిగి ఇళ్లస్థలాలు

చిత్తూరు : నగర శివార్లలో పెద్దలకు ధారాదత్తం చేసిన పేదల ఇళ్లస్థలాలను తిరిగి ఇప్పించటంలో లోక్‌సత్తా చేసిన పోరాటం ఫలించిందని పార్టీ నగర అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. నగర శివారు ప్రాంతమైన మురకంబట్టులో ఎస్‌హెచ్‌ని ఆనుకొని ఉన్న 6.90 ఎకరాల ఇళ్ల స్థలాలను రెవిన్యూ, ఏపీ 11 సీ అధికారులు అపోలో ఆసుపత్రి యాజమాన్యానికి కట్టబెట్టారన్నారు. దీనిపై లోక్‌సత్తా నాయకులు ప్రజల వైపు నిలబడి న్యాయపోరాటం చేశారన్నారు. ఇళ్ల స్థలాల యజమానుల ద్వారా న్యాయస్థానంలో వ్యాజ్యం వేశామన్నారు. ఆరు సంవత్సరాల పోరాటం తర్వాత ఇళ్ల స్థలాల యజమానులకు ఉపశమనం కలిగేలా న్యాయస్థానం తీర్పునిచ్చిందన్నారు. గత నెల 31వ తేదీన ఇళ్ల స్థలాలకు సంబంధించిన కొన్ని జడ్జిమెంట్లు విడుదలయ్యాయని, మిగిలినవి రావాల్సి ఉందని తెలిపారు.

# పార్లమెంటు ప్రజల గొంతుక కావాలి
# పదవులు లేకున్నా యువత స్థానిక సేవా నాయకులవ్వాలి: జేపీ

ప్రజల వాస్తవిక సమస్యల ఆధారంగా ఆరోగ్యకరమైన చర్చలతో పరిష్కారాలకు వేదికగా ఉండాల్సిన పార్లమెంటు అరుపులు, కేకలతో సమస్యగా మారిందని, సభ్యుల తీరుని ప్రజలు అసహ్యించుకుంటున్నారని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. గట్టిగా అరిచేవారి మాటే చెల్లుబాటవుతుందనటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. పలువురు పార్లమెంటు సభ్యులు క్రమశిక్షణారాహిత్యం, కుసంస్కారం, అసభ్యతలను ఒంటబట్టించుకున్నారన్నారు. స్వామి వివేకానంద జన్మదినం, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రామకృష్ణ మిషన్ నిర్వహించిన 'యువ పార్లమెంట్' కార్యక్రమంలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీల నుంచి పార్లమెంటు వరకూ అధికారం పట్ల విపరీతమైన లాలస కొనసాగుతోందని, ప్రస్తుతం జరుగుతున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్, కార్పొరేటర్లకు ఏమీ అధికారాలు లేకపోయినా ఉత్సవ విగ్రహాలుగా ఉండేందుకు కూడా టికెట్ల కోసం కొట్టుకుంటూ కోట్లు ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని జేపీ అన్నారు. ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించి సుందర భారతదేశాన్ని ఆవిష్కరించటంలో యువత కీలక పాత్ర పోషించాలని, 'అధికారానికి అర్థం సేవ' అనే స్పష్టతతో పనిచేయాలన్నారు. అధికారం కేవలం సేవ కోసమే కాబట్టి.. పదవులు లేకున్నా, తమ చుట్టుపక్కల సమస్యల పరిష్కారానికి యువత ఎక్కడికక్కడ నాయకత్వం వహించాలన్నారు. తమ కెరీర్‌లను, వ్యక్తిగత జీవితాల్ని చూసుకుంటూనే సేవ చేయాలన్నారు. క్రమశిక్షణ కలిగిన ఉత్తమ పౌరుల్ని తయారుచేసే విద్యావిధానం, ఉపాధినివ్వగలిగిన చదువులు ఉండాలన్నారు. స్వామి వివేకానంద, మహాత్మాగాంధీలాంటి వారెందరో జాతీయ భావాలను పెంపొందించటం వల్లే భారతదేశంలో బహుళత్వం వేళ్లూనుకుందన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ డా॥ బీవీ పట్టాభిరాం, గ్లోబల్ ఆసుపత్రుల డైరెక్టర్ డా॥ కేఎస్ రత్నాకర్, రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి జ్ఞానానంద, వివేకానంద మానవ వికాస కేంద్రం సంచాలకులు స్వామి బోధమయానంద, ఉప సంచాలకులు అవసరాల సత్యనారాయణ మూర్తి, స్వచ్ఛంద సేవకుడు ప్రేంకుమార్ తదితరులు, భారీసంఖ్యలో యువత పాల్గొన్నారు. ★



# సహకార భీమసింగి కర్మాగారాన్ని పరిరక్షించండి
## – లోక్‌సత్తా ఆధ్వర్యంలో అఖిలపక్ష ఆందోళన –

విజయనగరం జిల్లాలో సహకార రంగంలో ఉన్న ఏకైక భీమసింగి చక్కెర కర్మాగారాన్ని పరిరక్షించాలని కోరుతూ కర్మాగారం గేటు ఎదుట లోక్‌సత్తా పార్టీ అఖిలపక్ష ఆందోళన కార్యక్రమం చేసింది. కర్మాగారంలో నిల్వ ఉన్న 45,000 బస్తాల పంచదారను తక్షణం విక్రయించే చర్యలు చేపట్టాలని, ప్రజాపంపిణీ వ్యవస్థకు, తితిదే సహా ప్రముఖ దేవాలయాల చేత కొనుగోలు చేయించి పరిశ్రమను రక్షించాలని నేతలు నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, భీమసింగి కర్మాగారంపై 30,000 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. నేతల నిర్లక్ష్యం వల్ల పరిశ్రమ ఆర్థిక ఊబిలో కూరుకుపోయిందన్నారు. పరిశ్రమను కాపాడదామన్న చిత్తశుద్ధి అధికార పార్టీ నాయకుల్లో కనిపించటం లేదని ఆరోపించారు. పరిశ్రమ మూతపడితే రైతులు, కార్మికుల కుటుంబాలు వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాకు చెందిన కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి మృణాళిని, ఎమ్మెల్యేలు పరిశ్రమను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల పలుపరిశ్రమలు జిల్లాలో మూత పడుతున్నాయన్నారు. విదేశాల నుంచి పంచదార దిగుమతి అవుతుండటంతో మనదేశంలోని చక్కెర పరిశ్రమలు



గడ్డుపరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. విదేశీ పంచదార దిగుమతిని ఆపాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం నేత, ఎం.కొత్తవలస సర్పంచ్ పి. స్వామినాయుడు మాట్లాడుతూ, భీమసింగి మనుగడ ఎంతో అవసరమన్నారు. కుమరాం గ్రామానికి చెందిన వైసీపీ నేత పల్లి అప్పలనాయుడు మాట్లాడుతూ, కర్మాగారం దివాళా తీయటానికి ఓట్లు, సీట్లు పొందిన రాజకీయ పార్టీల తప్పుడు విధానాలే కారణమన్నారు. దీనికి ఈపార్టీఆపార్టీ అని తేడా లేదన్నారు. ఫ్యాక్టరీకి సమర్థుడైన ఎండీని నియమించాలని కార్మిక యూనియన్ కార్యదర్శి లగుడు సత్యం అన్నారు.


కార్యక్రమంలో తెదేపా నేతలు దనియాల పైడిరాజు, సారికి గౌరి, లోక్‌సత్తా నాయకులు రాయి పద్మ, చిట్టాబత్తుల నాగరాజు, పోలిపర్తి అప్పలసత్యం, భాస్కర్, పలువురు రైతులు, కార్మికులు పాల్గొన్నారు. ★

# రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలి

- డా॥ జయప్రకాష్ నారాయణ్

రాష్ట్ర విభజన వల్ల ఎక్కువగా నష్టపోయే ప్రాంతం రాయలసీమ కాబట్టి, ఆ ప్రాంతం వెనకబాటుతనం గురించి అంకెలతో సహా వివరిస్తూ ప్రత్యేక హోదా కల్పించాలని జనవరి 18, 2014న నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో వాదించాను. గణాంకాల సాక్ష్యాలతోపాటు రాయలసీమకున్న ఖనిజ సంపద, ఇతర వనరులు, భౌగోళికంగా వివిధ రాష్ట్రాలలోని ప్రముఖ నగరాలకు దగ్గరగా ఉండటం, మహారాష్ట్ర నుంచి దక్షిణాది వరకు ప్రత్యేక హోదా ఏ రాష్ట్రానికీ లేకపోవటం వంటివన్నీ వివరిస్తూ ఆ ప్రతిపాదన చేశాను. తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజల్ని ఏకకాలంలో మభ్యపెట్టి ఓట్లు, సీట్లు పొందిన పార్టీలు సభలో స్పష్టమైన వైఖరిని, పరిష్కారాల్ని చెప్పకుండా తప్పించుకున్నా, అసెంబ్లీలో లోక్‌సత్తాకు ఒకే ఒక్క సీటు ఉన్నా పూర్తిగా ప్రజల పక్షాన సద్వినియోగం చేసే ప్రయత్నం చేసింది. విడిపోతే ఆదాయం ఎంత, లోటు ఎంత ఉంటుంది అనే లెక్కల్ని బైటపెట్టి, వాటి ఆధారంగా కొన్ని ప్రతిపాదనల్ని చేశాను. అందులో రాయలసీమకు ప్రత్యేక హోదా, వెనకబడిన ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణలకు ప్రత్యేక ఆర్థిక సాయం, పోలవరం ప్రాజెక్టు తదితర అంశాలున్నాయి. అయితే లోక్‌సత్తా అంకెల్ని, ప్రతిపాదనల్నీ పరిగణలోకి తీసుకున్నా.. నూతన ఆంధ్రప్రదేశ్ మొత్తానికీ ప్రత్యేక హోదా అన్నట్టు మార్పు చేసి ప్రధాని చేత పార్లమెంటులో ప్రకటన చేయించారు. ఆంధ్రప్రదేశ్ మొత్తానికీ అంటే ఇతర రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తాయి కాబట్టి ప్రత్యేక హోదా రాకపోవచ్చు అని లోక్‌సత్తా లేవనెత్తిన అభ్యంతరాలను ఎవరూ పట్టించుకోలేదు. వాళ్లు తెస్తామంటే అడ్డంకొట్టినట్టు కనిపించటమెందుకు అని లోక్‌సత్తా కూడా విజ్ఞతతో మౌనం పాటించింది. అయితే ఇంతవరకూ ఆంధ్రప్రదేశ్‌కి ఒరిగిందేమీ లేదు.

హైదరాబాద్‌ని కోల్పోవటంతో ఆదాయం తగ్గటం, పారిశ్రామికీకరణ లేకపోవటం, వ్యవసాయేతర రంగాలలో




ఉపాధి కోసం అలమటించటం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రజల మొర వినకుండా, అసెంబ్లీ అనుమతి లేకుండా మెడలు వంచి రాష్ట్ర విభజన చేశారు. పార్లమెంటు ప్రొరోగ్ అవుతోంది కాబట్టి చర్చించే అవకాశం లేదని, తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, ఇతర సహాయాలు చేస్తామని, తమను నమ్మాలని అప్పటి ప్రధానమంత్రి సాక్షాత్తూ పార్లమెంటులో హామీ ఇచ్చారు. ఆనాటి ప్రతిపక్షంగా బీజేపీ కూడా అందుకు మద్దతు పలికి, తమ వల్లే ప్రధాని ప్రకటన చేశారని, తామే అధికారంలోకి వస్తాం కాబట్టి తప్పక నెరవేరుస్తామని ఢంకాబజాయించి నమ్మబలికింది, చివరికి ఇప్పుడు మాట వరసకు కూడా వాటిని ప్రస్తావించటం లేదు.

ప్రణాళికా సంఘం రద్దవుతుందని కొన్నాళ్లు, నీతి ఆయోగ్ కుదురుకోలేదని ఇంకొన్నాళ్లు, ఇతర రాష్ట్రాలు ఊరకోవటం లేదని ఆ తర్వాత కబుర్లు చెబుతూ ప్రత్యేక హోదా ఇవ్వలేదు. దీని వల్ల బాగా నష్టపోతున్నది రాయలసీమ. అయ్యిందేదో

అయ్యింది, కనీసం ప్రత్యేక హోదా పేరు అక్కర్లేకుండా 100 కార్పొరేట్, ఎక్సయిజ్ పన్ను రాయితీల్ని అడిగితే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు పెరిగి యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని లోక్‌సత్తా డిమాండ్ చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించలేదు. ఈ రాయితీల్ని ఇవ్వటానికి ఇతర రాష్ట్రాలను ఒప్పించాల్సిన పని కూడా లేదని, కేంద్ర కేబినెట్ ఒక్క కలం పోటుతో ఇచ్చేయచ్చని 'తెలుగు భవిత' వంటి కార్యక్రమాల ద్వారా కూడా పోరాడాం. అఖిల పక్ష రౌండ్‌టేబుల్ సమావేశాల్ని నిర్వహించాం. ఎక్కడ పరిష్కారమొస్తుందోనన్న భయంతోనేమో సమావేశాలకు కూడా అధికార పార్టీల వారు రాలేదు. ఆ తర్వాత పన్ను రాయితీల కోసం ప్రధానిని అడిగినట్టు ఢిల్లీలో ఓ మీడియా సమావేశంలో చంద్రబాబు చెప్పారు. ఆ పన్ను రాయితీలు కూడా రాష్ట్రమంతటికీ కాదు, కేవలం రాజధాని ప్రాంతం అమరావతి, చుట్టుపక్కలకేనట. కోట్ల రూపాయల ఖర్చు, మట్టి, నీరు, హోమాలు, యజ్ఞాల మధ్య జరిగిన రాజధాని అమరావతి శంకుస్థాపనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక హోదా లేదా దానికి సమానమైన సాయం ప్రకటన చేస్తారని కళ్లల్లో ఒత్తులు పెట్టుకుని ఎదురుచూసిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకి, ముఖ్యంగా సీమ, ఉత్తరాంధ్ర ప్రజలకి చివరికి నిరాశే ఎదురైంది. ప్రధాని ఇప్పటివరకూ చేసిన సాయం చాలా గొప్పదంటూ కీర్తిస్తూ, మీ దయ, మా ప్రాప్తం అన్నట్టు చంద్రబాబు నాయుడు వ్యవహరించారే తప్ప.. రాష్ట్ర ఆర్థికనష్టాల్ని, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనకబాటుతనాన్ని గురించి మాటమాత్రం కూడా ప్రస్తావించలేదు. ప్రత్యేక హోదాని చంద్రబాబు అడగా లేదు, మోదీ ఇవ్వాలేదు. నిజానికి రాష్ట్ర విభజన వల్ల ఏపీకి ప్రత్యేకించి వచ్చిన సాయమేమీ లేదు. ఇతర రాష్ట్రాలకు ఇవ్వనిది ఏదీ అదనంగా ఆంధ్రప్రదేశ్‌కి ఇవ్వలేదు.

ఇందుకు సంబంధించి 14వ ఆర్థికసంఘం నివేదికలోని పత్రాలను కూడా నేను ఇటీవల సాక్ష్యాలుగా చూపాను. 2015-20 గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా కేంద్రం నుంచి 42శాతం నిధులు బదిలీ చేసినా రెవిన్యూలోటు ఉన్న అన్ని రాష్ట్రాలకూ ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఆ డాక్యుమెంట్‌లలో స్పష్టంగా ఉంది. రెవిన్యూ లోటు భర్తీ కింద వచ్చే ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 22,113 ఇస్తుండగా, పశ్చిమ బెంగాల్‌కి రూ. 11,760 కోట్లు, చిన్న రాష్ట్రమైన కేరళకి రూ. 9519 కోట్లు ఇస్తున్నారు. ఐఐటీ, ఐఐఐటీ, ఐఐఎం వంటివి ప్రతి రాష్ట్రానికీ ఇస్తున్నారు.

హైదరాబాద్‌లో చేసిన తప్పే ముఖ్యమంత్రి మళ్లీ పరిశేష ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్నారు. అభివృద్ధినంతా రాజధాని చుట్టూనే కేంద్రీకరించటం వల్ల ఇతర ప్రాంతాలు అసమానతలకు గురై మళ్లీ తెలంగాణ జిల్లాల్లో తలెత్తిన పరిస్థితే పునరావృతమయ్యే అవకాశముంది. నూతన ఆంధ్రప్రదేశ్ పాలనలో కూడా ఆర్థిక, అధికార వికేంద్రీకరణ లేకపోవటం వల్ల, ప్రత్యేక హోదా తదితర హామీలు నెరవేరకపోవటం వల్ల బాగా నష్టపోతున్నది రాయలసీమ, ఉత్తరాంధ్ర. కొత్త రాష్ట్రంలో పాత రాజకీయం తీరుపై ఇటీవల వివిధ సందర్భాలలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ ప్రాంతాల ప్రజలతో మాట్లాడుతున్నప్పుడు వారిలో చాలా ఆవేదన, మోసపోయిన భావన కనిపిస్తోంది. రాయలసీమను మోసం చేసింది తెలంగాణవాళ్లు కాదు, అక్కడి నాయకులే అని ఆ ప్రాంతవాసులకు ఇప్పుడు చాలా స్పష్టంగా అర్థమైంది. సీమలోనే పుట్టిన వారు అంతమంది ముఖ్యమంత్రులుగా అన్నేళ్లు పరిపాలించినా ఆ ప్రాంతం అభివృద్ధికి ప్రయత్నించలేదు. పైకి సీమ బిడ్డలమని చెప్పుకుంటూ, చేతల్లో మాత్రం రైతులకు మేలు చేసే ప్రభుత్వ సహకార పాలసంఘాలను కుప్పకూల్చి సొంత కంపెనీలు పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లోనే.. ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారి సాధికారత, సహకారంతో ఒక నమూనాలాగా అభివృద్ధి చేయటానికి అత్యంత వెనకబడిన అనంతపురం జిల్లాలో రుద్రంపేట గ్రామాన్ని, అనంతపురం పట్టణంలోని 50వ వార్డుని దత్తత తీసుకున్నాను. వెనకబడిన ఉత్తరాంధ్ర, తెలంగాణలో కూడా ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సంకల్పించాం.

ఈ మొత్తం నేపథ్యంలో లోక్‌సత్తా ఒక నిర్దిష్ట ప్రతిపాదన చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు, తెలంగాణలోని 10 జిల్లాలకు మొత్తం 23 జిల్లాలకూ ప్రత్యేక హోదా ఇస్తే తెలుగువాడిగా సంతోషిస్తా. కానీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు కావలసిన మూడు నాలుగు అర్హతల్లో ఒక్కటే ఉందని చెబుతున్నారు. "కనీసం మీ నిర్వాకం వల్ల వెనకబడిపోయి ప్రత్యేక హోదా రాష్ట్రాల కంటే కూడా దయనీయంగా ఉన్న సీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకైనా ప్రత్యేక హోదా సహాయాన్ని అందించాలి" అని లోక్‌సత్తా డిమాండ్ చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో రాయలసీమ, ఉత్తరాంధ్రకు చెందిన 7 జిల్లాలు ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాల కంటే అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ప్రకాశం జిల్లాలోని

# కేబినెట్‌లో ఒక్క మహిళకూ చోటివ్వని వారు ఏ ముఖం పెట్టుకుని మహిళల ఓట్లు అడుగుతారు?




జనాభాలో సగభాగమున్న మహిళలకు రాష్ట్ర కేబినెట్‌లో ఒక్క స్థానం కూడా ఇవ్వని తెలంగాణ రాష్ట్ర సమితి ఏ ముఖం పెట్టుకుని జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మహిళల ఓట్లు అడుగుతుందని లోక్‌సత్తా పార్టీ ప్రశ్నించింది. మహిళలంటే కేసీఆర్ కూతురు కవిత, ఆయన చుట్టాలు కాదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా ప్రవీణ్ అన్నారు. కేసీఆర్ కుమార్తె కాకుంటే కవితకు టీఆర్ఎస్‌లో ఇంత స్థానం లభించేదా? అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు 50శాతం సీట్లు రాజ్యాంగబద్ధంగా ఇచ్చేలా సుప్రీంకోర్టు ఉత్తర్వు ఇచ్చిందని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మహిళలకు సగం సీట్లు ఇస్తామనటం తెరాస ఘనతేమీ కాదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే గ్రేటర్ ఎన్నికల్లో సాధారణ మహిళలకు టికెట్లివ్వాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్ సరోజాదేవి, జీహెచ్ఎంసీ ఉపాధ్యక్షురాలు గంగాభవానీ, కమ్యూనికేషన్ విభాగం కార్యదర్శి లావణ్య కూడా మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీ నేతలు భవానీ, సూర్యలక్ష్మి, జీవనలత, నాగమణి, విమల, సునీత తదితరులు పాల్గొన్నారు. ★

---

మార్కాపురాన్ని కూడా రాయలసీమలో భాగంగా గుర్తించాలి. ప్రత్యేక హోదా కలిగిన చిన్న రాష్ట్రాలు సిక్కిం, మిజోరాం, నాగాలాండ్ వంటి వాటిని మినహాయించి ఆంధ్రప్రదేశ్‌తో పోల్చదగిన అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ గణాంకాలను, రాయలసీమ గణాంకాలను పోల్చి చూస్తే, "శిశుమరణాల (ప్రతి 1000కి) రేటు అసోం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలలో వరసగా 55, 38, 36, 41 ఉండగా, రాయలసీమలో 44.5 ఉంది. ఆడపిల్లల అక్షరాస్యత 66,76,70,56 ఉండగా, రాయలసీమలో 56.5 ఉంది. మంచినీళ్ల సదుపాయం లేమి 45, 44, 41, 51 ఉండగా, రాయలసీమలో 71 శాతం ఉంది. పేదరికంలో ఉన్న జనాభా ఆ రాష్ట్రాల్లో 32, 8, 11, 10 ఉండగా, రాయలసీమలో 28శాతం ఉంది." ప్రత్యేక హోదా పేరుతో రాయితీల వల్లే సమర్థ నాయకత్వం ఉన్న హిమాచల్ ప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో దూసుకుపోతోంది. ఆ అవకాశం ఇక్కడా లభిస్తే సీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ వేగంగా వృద్ధిని సాధించి యువతకు ఉపాధిని అందిస్తాయి.

రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక హోదాపై ఇతర రాష్ట్రాల నుంచి దీనికి అభ్యంతరాలు వచ్చే అవకాశముండటంతోపాటు, వెనకబాటుతనాన్ని తొలగించటానికి జిల్లా యూనిట్‌గా ఒక జాతీయ విధానం ఉండటం వికేంద్రీకరణతో ప్రజల సాధికారతను పెంచుతుంది కాబట్టి, దేశవ్యాప్తంగా ఈ వెనకబాటుతనం గణాంకాలున్న జిల్లాలన్నిటికీ ప్రత్యేక హోదా సాయం అందించే విధానాన్ని వేగంగా రూపొందించి అమలుచేయాలి. ఉదాహరణకి, దేశంలోని ఆరువందల పైచిలుకు జిల్లాల్లో 100 జిల్లాలు వెనకబడి ఉంటే, వాటన్నిటికీ ప్రత్యేక హోదా రాయితీలు వర్తింప చేయండి. ప్రత్యేక హోదా పేరు మార్చినా మనకు అభ్యంతరం అక్కర్లేదు. మనకు కావలసింది వెనకబడిన జిల్లాలకు రాయితీలు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వానికి మున్ముందు ఆదాయవనరులు కూడా పెరుగుతాయి. పాత పరిశ్రమలకు కాకుండా కొత్తగా వచ్చే పరిశ్రమలకు నూరుశాతం ఈ పన్ను రాయితీల్ని కల్పించటం వల్ల కేంద్రానికి ఆదాయం తగ్గకపోగా, దీర్ఘకాలంలో పెరుగుతుంది. ★






# గ్రేటర్ ఎన్నికల్లో వన్ హైదరాబాద్ కూటమి సీట్ల పంపకం ఖరారు
# లోక్‌సత్తా 35, సీపీఐ (ఎం) 33, సీపీఐ 22, ఎంసీపీఐ (యు) 2

ఫిబ్రవరి 2న జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో 'వన్ హైదరాబాద్' కూటమిగా పోటీ చేస్తున్న లోక్‌సత్తా, సీపీఎం, సీపీఐల మధ్య సీట్ల పంపకాల చర్చలు విజయవంతంగా పూర్తయ్యాయి. లోక్‌సత్తా పార్టీ 35 సీట్లలో, సీపీఎం 33, సీపీఐ 22, ఎంసీపీఐ 2 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించామని కూటమి నేతలు ప్రకటించారు.

## వన్ హైదరాబాద్ కూటమి సీట్ల కేటాయింపు వివరాలు :

**లోక్‌సత్తా పార్టీ (35 సీట్లు)**
ఏఎస్‌రావు నగర్, చర్లపల్లి, హయత్‌నగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, కొత్తపేట, చైతన్యపురి, గడ్డి అన్నారం, మూసారంబాగ్, మెహిదీపట్నం, నల్లకుంట, రాంనగర్, గాంధీనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్, యూసఫ్‌గూడ, సోమాజీగూడ, అమీర్‌పేట, సనత్‌నగర్, రహమత్‌నగర్, మాదాపూర్, హఫీజ్‌పేట, చందానగర్, కేపీహెచ్‌బీ కాలనీ, అల్లాపూర్, మూసాపేట, ఓల్డ్ బోయినపల్లి, కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, అల్వాల్, వినాయక్‌నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజిగిరి, బేగంపేట.

**సీపీఐ (ఎం) (33 సీట్లు)**
కాప్రా, మీర్‌పేట హెచ్‌బీ కాలనీ, హబ్సీగూడ, రామంతాపూర్ ఈస్ట్, ఉప్పల్, మన్సూరాబాద్, చంపాపేట, లింగోజీగూడ, సంతోష్‌నగర్, ఉప్పుగూడ, బేగంబజార్, ఘోషామహల్, మైలార్‌దేవపల్లి, జియాగూడ, లంగర్‌హౌజ్, గుడిమల్కాపూర్, గోల్నాక, బాగ్ అంబర్‌పేట, ముషీరాబాద్, భోలక్‌పూర్, కవాడీగూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, బాలాజీనగర్, సూరారం, మౌలాలి, అడ్డగుట్ట, మెట్టుగూడ, బౌద్ధనగర్, బన్సీలాల్‌పేట.

**సీపీఐ (22 సీట్లు)**
మల్లాపూర్, నాగోల్, సరూర్‌నగర్, అక్బర్‌బాగ్, పత్తర్‌గట్టి, గౌలీపుర, లలితాబాగ్, ఐఎస్ సదన్, జంగంమెట్, రాజేంద్రనగర్, గోల్కొండ, అంబర్‌పేట, కొండాపూర్, రామచంద్రాపురం, బాలానగర్, జగద్గిరిగుట్ట, గాజులరామారం, రంగారెడ్డినగర్, వెంకటాపురం, నేరేడ్‌మెట్, గౌతంనగర్, తార్నాక.

**ఎంసీపీఐ (యు) (2 సీట్లు)**
షేక్‌పేట, మియాపూర్

అత్యంత వెనకబడిన వర్గాల ఐక్యవేదిక (ఎంబీసీ జేఏసీ), మరికొన్ని సంస్థలు కూడా వన్ హైదరాబాద్‌కి మద్దతు ప్రకటిస్తున్నందున వారు కూడా ఇదే కూటమిలో భాగంగా కొన్ని సీట్లు పోటీ చేస్తారు.

Posting Date 22-01-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on January 16th 2016




| | |
|---|---|
| **Book-Post**<br>PRINTED MATTER<br><br>If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | To |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad